ఆదివారం

ప్రజాశక్తి

2 డిసెంబర్, 2001

తెగిపోతున్న ఛాందసవాద సంకెళ్ళు



చదవండి! చదివించండి!!

నిజాన్ని నిర్భయంగా చాటేది
ప్రజల పక్షాన నిలిచేది

ప్రజాశక్తి
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతిల నుండి ప్రచురణ.

అంటించాలి. మీ స్టూలు సిద్ధం..

బాలనేస్తాలు

చిన్నారి చిత్రకారులు

ఎల్. దీపక్, 7వ తరగతి ఠాగూర్ విద్యాలయం, వైరా

పి. రవి కిరణ్, 8వ తరగతి, జడ్‌పి హైస్కూల్ జంగారెడ్డి గూడెం, పశ్చిమ గోదావరి జిల్లా

అనూష, 8వతరగతి విశాఖపట్టణం



సి. శ్వేత, 8వతరగతి కీర్తి స్కూల్, కల్వకుర్తి

'భారతదేశంలో మొదటివారు'

మొదటి భారత రాష్ట్రపతి : డాక్టర్ రాజేంద్రప్రసాద్
మొదటి భారత ప్రధాని : జవహర్‌లాల్ నెహ్రూ
మొదటి మహిళా ప్రధాని : శ్రీమతి ఇందిరాగాంధీ
మొదటి నోబుల్ బహుమతి గ్రహీత : రవీంద్రనాథ్ ఠాగూర్
మొదటి మహిళా మంత్రి : శ్రీమతి విజయలక్ష్మి పండిట్
మొదటి భారతదేశ నౌకా కమాండర్ : వైస్ అడ్మిరల్ ఆర్.డి.ఖత్రి
మొదటి భారతదేశ కమాండర్ ఆర్మీ : జనరల్ కరియప్ప
మొదటి మహిళా కేంద్రమంత్రి : రాజకుమారీ అమృత్ కౌర్
మొదటి మహిళా ముఖ్యమంత్రి : శ్రీమతి సుచేతా కృపలానీ

'సందర్శించిన వారు'

భారతదేశాన్ని సందర్శించిన మొదటి బ్రిటిష్ ప్రధాని : హెరాల్డ్ మ్యాక్ మిలన్
భారతదేశాన్ని సందర్శించిన మొదటి సోవియట్ ప్రధాని : వి.ఇ.బుల్ గానియన్
భారతదేశాన్ని సందర్శించిన యాత్రికుడు : మార్కోపోలో
భారతదేశాన్ని సందర్శించిన మొదటి చైనా దేశస్థుడు : ఫాహియాన్
భారతదేశంపై మొదటిసారి దండెత్తిన వ్యక్తి : అలెగ్జాండర్

–సేకరణ : కుంజా సంతోష్‌కుమార్

కలంస్నేహం

పేరు : జి. వీరన్న
వయస్సు : 11
చదువు : 9వ తరగతి
హాబీలు : టీవీ చూడటం, బొమ్మలు గీయడం, చదవడం
పూర్తి చిరునామా : గ్రామం : రావులపెల్లి తండా, మండలం : తుంగతుర్తి, జిల్లా : నల్లగొండ-508 280

పేరు : కాకర్ల రవికుమార్
వయస్సు : 12
చదువు : 6వ తరగతి
హాబీలు : క్యారమ్స్ ఆడటం, టీవీ చూడటం
పూర్తి చిరునామా : సన్నాఫ్ కాకర్ల రాజశేఖర్, పోస్టు : కేసరపల్లి, మండలం : గన్నవరం, జిల్లా : కృష్ణా-521102

పేరు : కె. కవిత
వయస్సు : 14
చదువు : 10వ తరగతి
హాబీలు : రింగ్‌బాల్, కబడ్డీ, క్యారమ్స్ ఆడటం, పుస్తకాలు చదవడం, పాటలు పాడటం
పూర్తి చిరునామా : డాటరాఫ్ పెంటయ్య, గ్రామం : చల్మెడ, మండలం : మునుగోడు, జిల్లా : నల్లగొండ-508253

"పోటు 'పోటో'యమ్మ పో(ఓ)టు"...

రుక్మిణి

"ఓర్నీ... ఈ గదిలో వుక్కబోస్తుందే.. గాలి రాటంలేదు... కంపు... కొంపదీసి ఎలుకలు పట్టి పీకితే నాగతేం కానూ? అరె... తలుపుతియ్... తియ్యమంటే...!" చిట్టిబాబు సామాన్ల కొట్టు కిటికీ ఊచలు పట్టుకుని కీచుమంటూ కేకలు పెడుతున్నాడు - భామ మాత్రం ఉలుకూ - పలుకూ లేకుండా ఆ కిటికీకి దగ్గర్లోనే వాలు కుర్చీలో తీరుబడిగా కాళ్ళు బారజాపి రామాయణమో... భారతమో ఏకదీక్షగా.. కళ్ళార్పకుండా గిలికి పారేస్తుంది! సామాన్ల కొట్టులో మసక చీకట్లోనేమో చిట్టిబాబు లుంగీ పైకీ కిందికీ ఎగదీసుకుంటూ చిందులేస్తూ చెవట్లు కక్కుతున్నాడు - (అదప్పటికే ఆ చిందులాటలో రెండు మూడు దఫాలు ఊడిమిడికింది కూడా!) ఒక ఎలుక కన్నంలో నుండి తొంగి చూడ్డంతో చిట్టిబాబు బిర్రబిగుసుకు పోయాడు. అది మీసాలు మిటకరిస్తూ కోరపండ్లు చూపించింది!

"అరె... తలుపు గొళ్ళెం తీయవే... అయ్యో.. నేనెంత బుద్ధిహీనుడ్ని... వెధవను.. తెలివిలేని వాడ్ని.. చవటను.. తలుపు తియ్యవే... ఆ చుంచెలుక నన్నే వెదుకుతుందీ... హుఁ.. అయినా నిన్ను నమ్మకోడం నాదే బుద్ధి తక్కువ... చెంపలేసుకుంటా!"

సత్యభామ ఓసారి తీక్షణంగా కళ్ళు పైకెత్తి బాబువంక చూడగానే బాబు హడలిపోయాడు -

"అవున్లే.. మీ అమ్మమ్మ.. అదే.. అసలుందో లేదో నేనైతే చూచిచావలేదు గానీ... వుండే వుంటుంది.. అది లేకపోతే మీ అవ్వా... అయ్‌మీన్ మా అత్తగారూ.. ఆవిడగారి కడుపున నువ్వెట్లా అవతరించి నా మెడకో గుదిబండలా తయారవుతావే భడవా... ఆఁ..

మళ్ళా ఓసారి గదిలోని చుంచూ.. పడక్కుర్చీలోని భామా గుడ్లురిమి చూడంగానే బాబు బిక్క చచ్చిపోయాడు -

"సరేనే.. ఖర్మ! ఇదుగో ఈ లుంగో ఓ వెధవది వూడుతుంటేనూ.. ఆఁ.. అదే.. మీ అమ్మమ్మ తన మానాన తాను కాశీ.. రామేశ్వరం పోక నా ప్రాణం తీయడం ఏంటి... సరే పోయెనుబో.. పోనీ.. అక్కడెక్కడ్నుంచో ఓ రాముల వారి విగ్రహాన్ని కొనుక్కొని రావటం ఏంటీ... సరే.. తెచ్చెను బో... అది తన కూతురు గారికి వీలునామా రాసివ్వడమేంటీ... సరే... ఇచ్చెనుబో.. అమ్మబాబోయ్.. అది బయటకు వచ్చేసింది.. అది తెగబలిసుందే భామా.. ఓర్నీ లుంగికినా... ప్లీజ్... ప్లీజ్...

భామలో వులుకూ పలుకూ లేదు.. కన్నంలో నుండి సగం తొంగి చూసిన చుంచు తాపీగా అదిలించేసరికి చిట్టిబాబు హడలిపోయాడు.

"సర్లేవే.. నీ తరం వచ్చేసరికి నువు దాన్ని సామాన్ల కొట్లో కుక్కేసినావు - బాగానే వుంది.. దాన్ని వెతికి పెట్టమని నువ్వు పురమాయించడవేంటీ.. సరే చేవుబో... నేను తగుదునమ్మా అని ఈ చీకటి సామాన్ల కొట్లో తలదూర్చడవేంటి.. దూర్చితినిబో... తవరట్లా బయట 'ఠకీ'మన్ని గొళ్ళెం బిగించి నన్నిట్లా ఎలికలకూ... పందికొక్కులకూ అల్పాహారంగా వదలడం అది ఏంన్యాయం... ఏం చట్టం.. ఏ రూలు... ఏ శాస్త్రం... ఏమాసైన్సు... ఏమా పురాణం.. కథా కమామిషు.. చిట్టిబాబు బాగా రెచ్చిపోయి కిటికీ చువ్వల్లో తల ఇరికించి చాలాకసిగా భామ మీద విరుచుకుపడి పోయాడు!

"అడిగావ్.. అదే... 'మోటో' అంటారు దాన్ని!" భామ తాపీగా అంది.

"మోటో... 'మోటో' ఏంటే టమోటో.. పీకులాటో..!" చిట్టిబాబు బరబరా జుట్టు పీక్కున్నాడు - భామ సుతారంగా కుర్చీని బాగా కొట్టు కిటికీ దగ్గరకు జరుపుకుంది. ఓ సన్నని మందహాసం కూడా చేయడంతో ఊచల వెనక చిట్టిబాబుకు ఊపిరి పోయినంత పనై గిలగిల్లాడి పోయాడు.



"బాబూ.. "మోటో" అంటే.. మొగుళ్ళ దురవ్యసనాల - పర్యవసానాల నిరోధక చట్టం ఆఫ్ కోర్స్! దీన్నే "మెన్స్ అబ్‌నాక్సియస్ ట్రెచెరస్ అబ్‌స్ట్రక్షన్" చట్టం! అంతా మన 'అర్జినెన్సు'ల్లాంటివే! దాన్ని గట్టిగా అమలు చేస్తేనే గానీ సంసారాలు బాగుపడి ఇళ్ళల్లో సుఖమూ... శాంతీ సుఖపుష్పాలు మొగ్గతొడ్గుతాయి దినదినాభి వృద్ధిదినం పెరిగిపోతాయన్న మాట!" భామ ఓరగా.. కోరగా.. కూర్రుగా.. అచ్చం అపర అద్వానీగారిలా అంది.

"వెలుగెంట్లు - దుర్వ్యసనాలు.. పర్యవసానాలూ.. ఎవరెవ్వాళ్ళు... దుర్వ్యసనాలేంటీ.. ఆ దినుసులేంటీ...?" అయోమయంగా బాబు కచ్చగా అడిగి కన్నంలోని మూతి వాటునే మూషికరాజు వంక భయంగా చూసి బిక్కజచ్చిపోయాడు.

"దుర్-వ్యసనాలంటే... ఆఫ్‌కోర్స్.. మీ మగాళ్ళందరికీ వుండేవేగదా! క్లబ్బులూ.. పేకాట.. పార్టీలు.. అర్ధరాత్రి తిరుగుళ్ళు... అంకమ్మ శివాలు.. కొంతొకటో పెళ్ళాల వుసురు పోసుకొనుట.. బాదుట.. బలాత్కరించుట.. బంధించుట.. వేధించుట.. అల్లకల్లోలములను రేపుట.. అరుచుట.. మాతుల జాబితా పఠించుట.. అంతిమంగా బలవన్మరణములను తెచ్చి పెట్టుట..

కూలబడడానికీ.. విరుచుకుపడడానికీ కొట్టులో అనువైన ఆసనం ఏదీ లేకపోవడం వల్ల.... చిట్టిబాబు కిటికీ వూచల్నే కీర్తికిరీటాలుగా, బిగుతుగా, బిర్రబిగుసుకుని బిళ్ళకరుచుకుని బిగదీసుకుపోయి మిర్రి మిర్రి భామ వంకే చూస్తుండి పోయాడు.

"అరె.. అట్లాంటి వెధవ పన్లన్నింటికీ మీకు ఎన్నో రకాల పథకాలూ... ఆయుధాలూ వున్నై గదనే! మీరు సాధించి.... వేధించి వేపుకు తినవచ్చు గదా... రాత్రిళ్ళు శుభ్రంగా ముదుచుకుని మూడంకె వేసి మొగుడ్ని మెదలకంటా దగ్గరకు రానీయకుండా... అన్నం కూరల స్వరూప స్వభావాలు మార్చి.. పుట్టింటి వాళ్ళతో కలిసి 'యాగీ' పెట్టించుట.. అయ్యో భగవంతుడా.. చిట్టచివరగా పోలీసుకేసు దాకా అవకాశాలుండగా.. నన్నిట్లా ఎలకలకు అల్పాహారంగా ఎరవేయడం సబబా? నీ 'మోటో' - 'గీటో' మూటగట్టి గట్టున పెట్టు - గడియ తియ్యవే భామా...!" చిట్టిబాబు ఆవేదనగా అవరోహనా క్రమంలో రోదన ప్రారంభించబోయాడు.

"ఒప్పుకున్నాం! మరి ఇన్ని చట్టాలూ మీ చేతిలో వుండగా ఆ అద్వానీ గారేమో, కాషాయ కూటమంతా కూడబలుక్కుని దేశం మీదకు ఈ 'పోటో' చట్టం తేవడం సబబుగా వుందా? దాన్నిగానీ వీళ్ళు అమలు పరిస్తే దేశంలో మానవ హక్కులుంటాయా? మైనార్టీలు అసలు మెతుక్కైనా మిగులుతారా? స్వేచ్ఛా... పత్రికా స్వాతంత్ర్యం వుండాలా... వద్దా?"

"ఓహోహో... ఆహహాఁ... టెర్రిస్టు... ఉగ్రవాద చట్టాలు గదూ.. అవునవును.. అవి ఈ దేశానికి చాలా అవసరమే భామా! మన దేశం ప్రశాంతంగా వుండాలంటే... శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లాలంటే చాలా చాలా అవసరం! అబ్బో... అమెరికాలోచూడు... ఎంత దారుణం జరిగిపోయిందో... అబ్బో... డేంజరస్!"

"అవునవును... ఆఫ్ఘనిస్థాన్‌లో చూడు ఎంత కిరాతకం జరుగుతుందో... చిట్టిబాబూ అసలు ఈ సెప్టెంబర్ 11తో మన ప్రధానిగారికేమయింది - మన దేశంలో ఏదైనా 'ఉగ్రవాదం' అవాళ్టినుంచే మొదలయిందా? అంతకుముందస్సలు లేదా?; అసలు టెర్రరిస్టు అంటే ఎవడు? 'టెర్రరిజం' అంటే ఏంటి? స్వాతంత్ర్యం.. స్వేచ్ఛా అంటే సెప్టెంబర్ పదకొండూ... రెండు ట్రేడు టవర్సేనా ఏంటి, మరిక్కడి త్రిశూలాలూ.. లాగూలడాయి టోపీ లాఠీల కవాతులేమిటి... మసీదుల్ని కూల్చి... చర్చీలను, మనుష్యుల్ని తగలబెట్టడం.. హవ్వ! వీటన్నింటినీ అదుపు చెయ్యడానికి ఇప్పటికే మందగ్గిర చట్టాలున్నాయి గదా! చిత్తశుద్ధే లేదు గదా!"

"వాటి డోసు సరిపోదేమో భామా!" చిట్టిబాబు కలుగులో నుండి పూర్తిస్థాయిలో బయటపడి పళ్ళికిలిస్తున్న పందికొక్కును చూసి కాళ్ళు తపతప నేలకేసి బాదాడు.

"ఎవరకయ్యా... నీకా సరిపోన్ది! ఎలకల్తో బాటు ఆ కొట్టులో పాములున్నాయనుకో... సరిపోతుందా డోసు! అసలు ఉగ్రవాదులే ఉగ్రవాద నిరోధక చట్టాలు చేయడం వెనక మతలబేంటో తెలుసా చిట్టిబాబూ!"

"సర్సరె... ఆ చట్టాల గోల నాకెందుకు? 'పోటో డౌన్... డౌన్' అని అరిచి కేకలు పెట్టనా... పెడితే కొట్టు గది గొళ్ళెం తీస్తావా" చిట్టిబాబు ఆశగా అడిగాడు - భామ కిలకిల నవ్వింది..

"అదెట్లాగూ అమలు కాదని వాళ్ళకూ తెలుసు... ప్రజలు సహించరనీ తెలుసు!"

"ఆఁ.. మరైతే పీడాపాయిరి! మరి నీకూ.. నాకూ.. ఆ పందికొక్కుకూ వచ్చిన ప్రమాదం ఏమీలేదు గదనే!" బుర్ర అడ్డదిడ్డంగా వూపుతూ అరిచాడు చిట్టిబాబు.

"అక్కడే వుంది మతలబంతా! చిట్టిబాబూ... రెండు మూడు నెలల్లో యు.పి.లో ఎన్నికలు జరగ బోతున్నాయి గదా... రాజ్‌గారు, వాజ్‌గారు ఎన్ని పిల్లి మొగ్గలేసినా ఈ పాటికే అక్కడ బీజేపీ అడుగూడి అతలా కుతలం అయిపోయింది గదా! అందుకనీ ఈ 'పోటో' వీటో అయితే దాన్నే ప్రచారం చేసుకుంటా రన్నమాట" ఇదుగో-దేశాన్ని ఉగ్రవాదం నుండి కాపాడ్డానికి మంచి పకడ్బందీ చట్టం తెద్దామంటే ప్రతిపక్షం వాళ్ళే పనిగట్టుకుని నీళ్ళు కార్చారు... వాళ్ళంతా దేశ ద్రోహులు... మేం అసలు నికార్సు దేశభక్తులం... అందుకని మీరు సురక్షితంగా వుండాలంటే 'పోటోకే మీ ఓటు' అని చంకలెగరేస్తూ ఓట్లు దండుకోవాలన్నది వాళ్ళ పథకం!"

దీంతో చిట్టిబాబు నోరు బార్లా తెరిచి ఎక్కడ ఎగిరి పడదామా అనుకునేంతలో భామ కొట్టు గడియ కాస్తా తీయనే తీసింది!! ★

వాలీబాల్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం పెరగాలి

జాతీయ, అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో భారత్‌కు ఎన్నో పసిడి పతకాలను అందించిన తనను ప్రభుత్వం ఎంతో ఆలస్యంగా గుర్తించిందని అర్జున అవార్డు గ్రహీత కృష్ణాజిల్లా వాలీబాల్ క్రీడాకారుడు పి.వి.రమణ అభిప్రాయ పడ్డాడు. సౌత్ సెంట్రల్ రైల్వేలో అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమణ యిటీవల విజయవాడలో జరిగిన అంతర్ డివిజన్ రైల్వే బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి హాజరయ్యాడు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ అతన్ని ఘనంగా సన్మానించింది. పంజాబ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో ఆయన రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వాలీబాల్ క్రీడలో భారత జట్టుకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ కింద అర్జున అవార్డు పొందిన **రమణ** 'ప్రజాశక్తి' విజయవాడ క్రీడాప్రతినిధి **ఎం.రామకృష్ణ**కు యిచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడించారు.

అర్జున అవార్డు వస్తుందని మీరు ముందుగానే ఊహించారా?

నా ప్రతిభను ప్రభుత్వం చాలా ఆలస్యంగా గుర్తించింది. నాలుగేళ్ళ క్రితమే వస్తుందనుకున్నాను.

వాలీబాల్‌లో మీ ప్రవేశం ఎప్పుడు జరిగింది?

వాలీబాల్‌లో 1980లో ప్రవేశించాను. ఇంటర్మీడియట్ చదివే రోజులనుండే వాలీబాల్ ఆటలో మంచి ఆసక్తి కనబర్చేవాడిని.

ప్రస్తుతం ఏ ఉద్యోగం చేస్తున్నారు?

సౌత్‌సెంట్రల్ రైల్వేలో అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్.

వాలీబాల్‌లో మీకు ఓనమాలు ఎవరు నేర్పారు?

వాలీబాల్‌లో నాకు ఆసక్తిని కృష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టి. కోటేశ్వరరావు రేకెత్తించారు. ఆయన కారణంగానే నేను అంతర్జాతీయంగా గుర్తింపు పొందాను.

మీ కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎలావుంది?

నా భార్య విజయ కూడా వాలీబాల్ క్రీడాకారిణే. జాతీయస్థాయి పోటీలలో ఆమె రాష్ట్ర జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించారు. ఆమె ప్రోత్సాహమే నన్ను ముందుకు నడిపించింది.

భారత వాలీబాల్ జట్టు పరిస్థితి వివరిస్తారా?

దేశంలో చక్కటి ప్రతిభ కలిగిన క్రీడాకారులు చాలామంది వున్నారు. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం తగిన విధంగా లేకపోవడం వల్ల క్రీడాకారులు కొన్ని యిబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల అంతర్జాతీయ వాలీబాల్ ఫెడరేషన్ నిర్వహించిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌లలో ప్రపంచ పోటీలకు భారత జట్టు కొద్ది తేడాతో అర్హత కోల్పోయింది.

భారత జట్టు ఆటతీరు ఎలా ఉంది?

భారత జట్టు ఆటతీరు మరింత మెరుగుపడాలి. జపాన్, చైనా, కొరియా జట్లతో ఆడితే మరిన్ని మెళకువలు తెలుసుకోవడానికి అవకాశం వుంది. ఇతర దేశాలలో వాలీబాల్‌ను



అర్జున అవార్డు గ్రహీత రమణ

ఇండోర్‌లో ఆడుతుండగా మన దేశంలో నేటికీ అవుట్‌డోర్‌లోనే ఆడుతున్నారు.

మీ తొలి విజయం.....?

1982లో భోపాల్లో జరిగిన జాతీయ క్రీడల్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతాకాన్ని గెలుపొందాను.

జాతీయ స్థాయిలో మీ విజయాలు...

1983-84లో గుంటూరులో జరిగిన నేషనల్స్‌లో, 1984-85లో కాన్పూర్ నేషనల్స్‌లో బంగారు పతకాలు. 1985-86లో ఢిల్లీలో జరిగిన నేషనల్స్, 1986-87లో బెంగుళూరులో జరిగిన నేషనల్స్‌లో ఇండియన్ రైల్వేస్‌కి ప్రాతినిధ్యం వహించి బంగారు పతకాలు సాధించాను. 1987లో కాలికట్ నేషనల్స్, 1994 పూనే నేషనల్స్‌లో ఆంధ్రాకు బంగారు పతకాలు తెచ్చాను.

అంతర్జాతీయ పోటీల్లో మీ కీర్తి కిరీటాల గురించి వివరిస్తారా?

1984లో రియాద్‌లో జరిగిన ఆసియా జూనియర్ పురుషుల వాలీబాల్‌లో నాలుగో స్థానం పొందిన భారత జట్టులో సభ్యుడిని. రష్యాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో కూడా పాల్గొన్నాను. 1985వ సంవత్సరంలో జపాన్‌తో మద్రాస్‌లో జరిగిన టెస్ట్‌మ్యాచ్, 86లో కొల్‌కతాలో జపాన్‌తో టెస్ట్‌మ్యాచ్, విశాఖపట్నం టెస్ట్ మ్యాచ్‌లో భారత్‌కు ఛాంపియన్‌షిప్. 1986వ సంవత్సరం సియోల్‌లో జరిగిన 10వ ఆసియా గేమ్స్‌లో భారత్‌కు కాంస్యపతకం, హైదరాబాద్‌లో జరిగిన ఇందిరాగాంధీ అంతర్జాతీయ గోల్డ్‌కప్ టోర్నమెంట్‌లో బంగారుపతకం, 1987వ సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన ప్రపంచ రైల్వేగేమ్స్‌లో కాంస్యపతకం, 1989లో కైరోలో జరిగిన ఈక్విటేషనల్ టోర్నమెంట్, 1990లో అల్విన్ గోల్డ్ కప్ టోర్నమెంట్, 1991వ సంవత్సరంలో ఇండోనేషియాలో జరిగిన టోర్నమెంట్‌లు నా ప్రతిభా పాటవాలకు ఛాలెంజ్‌గా నిలిచాయి.

వాలీబాల్ అభివృద్ధికి మీరిచ్చే సూచనలు?

వాలీబాల్ క్రీడకు మరింత ఆదరణ పెరగాలంటే ప్రతి టోర్నమెంట్‌కు జట్టును పంపించాలి. ఎలక్ట్రానిక్ మీడియాలో ఇతర క్రీడలకు ఇస్తున్న ప్రచారం వాలీబాల్‌కు కూడా ఇవ్వాలి. వాలీబాల్ ఫెడరేషన్ నిబంధనలు సరళతరం చేయాలి. కోచింగ్ క్యాంపులు ఎక్కువగా నిర్వహించాలి.

ఫెడరేషన్ నిబంధనలపై మీ అభిప్రాయం?

వాలీబాల్ ఫెడరేషన్ ఇటీవల కొన్ని మార్పులు చేసింది. పాయింట్ల విధానంలో మార్పువల్ల ఏ చిన్న తప్పు జరిగినా ఓటమి పాలవాల్సివస్తోంది. గేమ్ కూడా త్వరగా పూర్తవుతోంది. నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉంది.

నూతన క్రీడాకారులకు మీరిచ్చే సలహాలు?

పట్టుదల, కృషి ఉంటేగాని గెలుపు సాధ్యంకాదు. అయితే గెలుపు ఓటములను ఒకే విధంగా అంగీకరిస్తూ మరింత కృషి చేయాలి. ఎక్కువ టోర్నమెంట్లలో పాల్గొనాలి. కోచింగ్ క్యాంపులకు తప్పనిసరిగా హాజరవ్వాలి.

మీ లక్ష్యం ఏమిటి?

ఎక్కువమంది యువకులను వాలీబాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి. నా కోచింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ కీర్తిప్రతిష్టలు నలుదిశలా ఇనుమడించాలి.

★

కీలు బొమ్మలు

పెద్దింటి అశోక్‌కుమార్

పాములా మెలికలు తిరిగి పల్లెవైపు సాగిపోయిన తారు రోడ్డు. రెండు పక్కలా ఎరుపు, పసుపు, తెలుపు రంగుపూలతో గాలికి కదలాడుతున్న గులాబీ తోటలు. అన్ని పూలున్నా ఎక్కడా సీతాకోక చిలుకల జాడలేదు. తుమ్మెదల ఘీంకారం లేదు. సువాసన లేదు. ఘాటైన పురుగు మందు వాసన.

ఎండమండిపోతోంది.

"అలాగైతే మాస్క్ తెచ్చుకున్నారా....?" ఆటోలో కూర్చున్నప్పుడే డ్రైవర్ ప్రశ్న.

"ఎందుకు....?" అర్థంకాక అడిగాను.

నావైపు అనుమానంగా చూసి "ఇప్పుడేగా సర్వాయిపల్లె వెళ్ళాలన్నారు" అన్నాడు.

భుజానికో బ్యాగ్, చేతిలో కొన్ని ఇనుస్ట్రుమెంట్స్, అరటిపళ్ల పొట్లం, మినరల్ వాటర్ బాటిల్... ఏదో సర్వే కొరకు వెళ్తున్నాననుకుంటున్నాడు.

"అయితే...?" అడిగాను

"ఈ మధ్య పూలసాగు అని, మరేదో అని, చాలా మంది సర్వే కొరకు వస్తున్నారు. ఊళ్ళోకి చేరాలంటే నాలుగు కిలోమీటర్ల పొడవున ఉండే గులాబీ తోటను దాటాలి. మాకు అలవాటయింది. ఒకరిద్దరు ఆటోలోనే స్పృహ తప్పారు.

"నీది సర్వాయివల్లేనా...? ఎవరికొడుకువు...?" అతడిని అంచనా వేస్తూ నా ప్రశ్న.

"కోళ్ళవెంకటి కొడుకును..." గేరుమారుస్తూ.

ఐదేళ్ల కింద వీడు చిన్నపిల్లాడు. అందుకే గుర్తు పట్టలేదు అనుకున్నాను. ఇంటిపేరు ఏమిటో గుర్తుకు రాక పౌల్ట్రీ పెట్టాడని అందరూ అదే పేరుతో పిలిస్తే న్యూస్‌లో కూడా అదే పేరును రాస్తూ "కోళ్ళవెంకటి చావలేదు సార్! చంపబడ్డాడు. పౌల్ట్రీలో పదేళ్ళ అనుభవం ఉన్నవాడు. యాంటీడంపింగ్, కస్టమ్స్ డ్యూటీని దాటి, అమెరికా చికెన్ లెగ్‌పీస్, ఎగ్‌పౌడర్ చౌకగా దేశంలోకి వచ్చాక మన కోళ్ళ పరిశ్రమ ఛిన్నాభిన్నమైంది. బహుళజాతి సంస్థలు, వారికి స్వాగతం పలికిన ప్రభుత్వ నేతలు కలిసి చేసిన హత్య ఇది." ఆవేశంగా ఎడిటర్‌తో అంటే...

"ఈడార్క్ ఫ్రోజన్ చికెన్‌లో కొవ్వు శాతం ఎక్కువ. ఈ లెగ్‌పీస్‌ను వాళ్ళు వ్యర్థపదార్థంగా భావిస్తారు. సముద్రంలో డంప్ చేస్తే దేశంలో పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని వర్ధమాన దేశాలకు చౌకగా సరఫరా చేసింది. కోల్డ్‌స్టోరేజ్ చేయనందున ఎన్నో రోగక్రిములు కూడా దానితో దిగుమతి అవుతున్నాయి. ఇవన్నీ తెలిసి కూడా ప్రభుత్వం ఎందుకు కళ్లుమూసుకుందంటావు..." వేదాంతిలా నవ్వుతూ ఎడిటర్.

అప్పట్లో వెంకటి ఆత్మహత్యను హైలెట్ చేస్తూ వ్యాసాలు రాస్తే ఎక్స్‌గ్రేషియా, సానుభూతితో ప్రభుత్వం చేతులు దులుపుకుంది. తర్వాత చేపల వ్యాపారం చేసే పోచిరెడ్డి, పాలు అమ్ముకు బతికే నర్సింలు, ఆయిల్ మిల్లు ఇస్తారి, సన్‌ఫ్లవర్ రైతుల ఆత్మహత్యల నిజాలు వెలుగు చూసేవే! ఎవరి నుండి బెదిరింపులో, బుజ్జగింపులో! కాగితాల్ని పక్కన పెట్టాడు ఎడిటర్.

కనుచూపు మేరలో ఎక్కడా చెట్టులేదు. హెలీకాప్టర్‌పై పురుగు మందు స్ప్రే చేయడం మొదలయ్యాక అడ్డువచ్చిన చెట్లన్నీ నరికారు. మొదళ్లకు ఇగురు రాకుండా ఆసిడ్ పోసారు. అక్కడక్కడా నీడ కొరకు చిన్న చిన్న మంచెలు. రోడ్డు మీద ఎలాంటి అలికిడి లేదు. ఆటో మలుపు తిరుగుతుంటే ఏదో గుర్తొచ్చి.

"నామక్కతోటను సేటు కొన్నాడు. కంకుల్ని విరిచి లారీమీద కామారెడ్డి మార్కెట్లకు పంపుతడు. మాకు అవసరమున్నా అక్కడికి పోయి కొనుక్కోవాలె." రెండు కంకుల్ని కాల్చి ఇస్తూ దేవయ్య బాధగా.

"పల్లెలో పండిన ఏ పంటయినా పట్నాలకు పోతుంది. మన పంట మనకే నాగరికతను పులుముకుని అందమైన పాకెట్లలో ఎక్కువ రేటుకు' తిరిగి వస్తుంది. ఈ పరిణామం ఎక్కడికి దారి తీస్తదో తెలియదు." ఆలూ చిప్స్, పాప్‌కార్న్, పాలపాకెట్స్... ఈ మధ్యే మొదలైన కూరగాయల పేకింగ్ గుర్తొచ్చి అన్నాను... అప్పటికింకా కాంక్రీట్‌ను తొక్కుతూ కరిగిన లావాలాంటి తారుపై రోడ్డు రోలర్ తిరగలేదు. చుట్టూ బురద నీళ్లు... మట్టివాసన.

పూలమీద తేలివచ్చిన పురుగుమందు వాసనకు ఉక్కిరి బిక్కిరయ్యాను. రోడ్డు పక్కన డ్రిప్ ఇరిగేషన్ పంపును రిపేరు చేస్తున్నట్టున్నారు రైతులు. కొద్దిసేపు ఆటో ఆపమన్నాను. కనీసం పలకరింపు లేదు. మొహాలకు మాస్కులు. డ్రిప్ పద్ధతి వచ్చాక నీటి వాడకం పద్ధతే మారిపోయింది. మొక్కల మొదట్లో పైపుల ద్వారా చుక్కలు



చుక్కలుగా నీళ్లు. రైతుల కన్నీళ్లు గుర్తొచ్చాయి. ముందుకు కదిలాను.

"ఓ అన్నా... గట్ల నడిచిపోతున్నవేంది...? ఇప్పుడు డెన్‌డ్రాన్ సల్లుతరు. ఇట్ల నీడకు రా!" ముంచెలోంచికేక.

ఊరిపొలిమేరలో ఆటో దిగుతుంటే విచిత్రంగా చూన్నా 'డెన్‌డ్రాన్' పేరునే గుర్తు చేసాడు. ఇంతకుముందయితే రాత్రిపూట చల్లేవారట. చీకట్లో హైపవర్ సెర్చ్‌లైట్... ఎక్కువ పెట్రోల్ ఖర్చు! అందుకే పగలు. అడిగేవారు... అడిగినా వినేవారు లేరు! చట్టాలన్నీ హాలెండ్‌లోనే!

అటువైపు నడిచి నిచ్చెన మీదుగా మంచెపైకి ఎక్కాను. ఇనుపరాడ్‌లపై తాటిపత్రి కప్పారు. కొద్దిగా ఊపిరాడినట్టయింది. మినరల్ బాటిల్ తీసాను. పాకెట్లోని ఉప్పుడు బియ్యాన్ని తింటోంది. పూలతోటల సాగు వచ్చాక ఈ మధ్య ఎక్కడ చూసినా ఈ పాకెట్సే కనిపిస్తున్నాయి. 'అధిక పోషక విలువలు' అంటూ టీవీల్లో ప్రకటనలు. ఆమెవైపు పరిశీలనగా చూసాను. మానవత్వం మీదమాయని మచ్చలా నుదిటిపై గాయం మచ్చ! గత[illegible] కళ్ళముందు కదిలింది.

కేకలు, బొబ్బలు... అరుపులు, ఆవేశం... వెల్లువెత్తిన జనం!

కరెంటు ఛార్జీలు పెంచినందుకు నినాదాలు.. నిరసనలు!

"మనం ఉద్యమించాలి ఎల్లక్కా! మననేతలు ప్రపంచ బ్యాంక్ చేతిలో కీలుబొమ్మలయ్యారు. మనం చూస్తూ కూర్చుంటే దేశాన్ని అమ్ముతారు..." ఆవేశంగా అన్నాను.

నా మాటలు ఎంతవరకు అర్థమయ్యాయో తెలియదు కానీ... కరెంట్ ఛార్జీ చుక్కల్ని తాకుతుందని, అవసరమున్నంత అందడం లేదని అర్థమైంది. ఫలితంగా ఊరు కదిలింది. కనిపించిన వాహనాల్లో జనం అసెంబ్లీ ముందుకు చేరారు.

కర్ఫ్యూ... ఘర్షణ, కాల్పులు... కొందరు చనిపోయారు. ఎల్లక్క నుదుటిపై లాఠీదెబ్బ! "ఏ ఊరెళ్ళాలి... ఎండలపోతున్నవు." పరామర్శలాంటి పలకరింపు.

"నువ్వు దేవయ్య భార్యవు కదూ!" తారు రోడ్డు మీద ఎండమావుల్ని తొక్కుతూ వెళ్తున్న పూల ట్రక్కువైపు చూస్తూ గొణిగినట్టుగా అన్నాను. నావైపు విచిత్రంగా చూసింది.

"మీరెవలు సారూ.. నా పెనిమిటిని యాది జేస్తిరి. ఆయన సచ్చిపోయి ఐదేండ్ల కాలం దాటింది." జీవం లేని ఎల్లక్క కళ్లల్లో నీళ్లు. గతాన్ని కెలుకుతున్న జ్ఞాపకాల్లోంచి ఆవేదన శోకమై కరిగింది.

ఆనాటి రైతులు, కూలీలు ఏరి...? గెట్టు పంచాయతీలు... నీటి తీరువాలు ఏవి? ఈ భూమి ఎవరిది...? పెత్తనం ఎవరిది..? హరిత విప్లవం, భూసంస్కరణలు, హైబ్రిడ్ సీడ్స్, గ్రోమోర్ ఫుడ్స్, పంచవర్ష ప్రణాళికల అభివృద్ధి, స్వయం సమృద్ధి, పి.డి.ఎస్., ఎఫ్.సి.ఐ. ఆహార భద్రత... ఇవన్నీ దిగుమతులపై ఆంక్షలు తొలగించాక వెల్లువలా వచ్చిపడిన సరుకుల తాకిడికి కుప్పకూలిపోయాయి. ధాన్యం రేటు పడిపోయింది. ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయం మొదలెట్టింది. వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ఫలితంగా పూలసాగుతో హాలెండ్ బొకారో కంపెనీ ప్రవేశించింది. వారికి

అనుగుణంగా కౌలుదారు చట్టాన్ని మార్చింది ప్రభుత్వం.

ఎల్లక్క పెద్ద పెట్టున శోకం పెడుతోంది. ఏడుపు విని నలుగురూ వచ్చి ఓదారుస్తారనుకున్నాను. ఎవరూ రారేం!

తల్లిలాంటి భూమి తమది కాకుండా పోయాక మనసు బండబారిపోయింది. మనుషులు బండబారిపోయారు. యంత్రాల్లా పని చేస్తున్నారు. ఏడ్పులు మామూలైపోయాయి. ఇప్పుడు కన్నీరుకు కరువే!

ఒకవైపు నుండి కాదు. చేపల నీలి విప్లవాన్ని విచ్ఛిన్నం చేసిన ఆక్వాకల్చర్, పసుపుపచ్చ విప్లవాన్ని నాశనం చేసిన పామాయిల్, శ్వేతవిప్లవాన్ని దెబ్బతీసిన సింథటిక్ మిల్క్‌పాకెట్స్, నెదర్లాండ్ పాలు, అమెరికా గోధుమలు, చైనా బియ్యం, చెక్కెర, పప్పులు... చౌకగా మార్కెట్లను ముంచెత్తాక పురుగు మందులు జీర్ణాశయాలకు రంధ్రం చేసాయి.

"సారూ... మొన్న పేపర్లో వడ్ల గురించి రాసింద్రట గదా! ఇప్పుడైనా వడ్లను కొంటరంటవా..." గడ్డ పెరుగును ముందుంచి ఆశగా అడిగింది ఎల్లక్క. పక్కనే దేవయ్య ఉన్నాడు అప్పుడు.

"ముందుగల్ల అన్నం తిననియ్యి. పేపరోళ్లు తలుచుకుంటే ఏదైనా చేస్తరు. రెండు రోజుల నుంచి మాతోనే ఉంటండు. గోడౌన్ దగ్గర సారు మాట్లాడుతుంటే ఎం.ఆర్.ఓ. ఉచ్చపోసుకున్నడు.'' అంతులేని ఆత్మవిశ్వాసంతో దేవయ్య. పక్కనే ఊరకోడి మాసం, చేపల పులుసు, నేను వారి బతుకుల్ని మారుస్తానన్న కొండంత ధీమా! వారికి.

ఈ పత్రికలు, విమర్శలు, సభలు, సమావేశాలు, నిరసనలు, ఏవీ... స్వేచ్ఛావ్యాపారాన్ని ఆపలేకపోయాయి. వాణిజ్యం కీలకమైన, గ్లోబలైజేషన్ సాంకేతిక జ్ఞానం ద్వారా, సరుకుల ప్రవాహం ద్వారా పల్లెల్లోకి, పట్నాల్లోకి చొరబడింది. పరిశ్రమల మీద, బయోటెక్నాలజీ, ఇన్ఫటెర్ పరిశోధనల మీద పట్టు బిగించింది. జేబులోని సెల్‌ఫోన్ మోగింది. తేరుకుని తీసి 'హలో' అన్నాను. ఎడిటర్. ఎల్లక్క కుమిలిపోతూనే ఉంది ఇంకా.

"చెప్పండి" నిరాసక్తిగా అన్నాను.

"సాటర్‌డే కాదు. ఫ్రైడేనే... మీటింగ్!"

"ఎందుకు....?" ఆతృతగా అడిగాను.

"ప్రభుత్వ వ్యూహం మారింది"

"ఏమిటి?"

"హ్యూమన్ జినోమ్ ప్రాజెక్ట్ ప్రయోగాలతో వేరువేరు సంస్థలు వేరువేరు శరీర భాగాల పేటెంట్లు హక్కుల్ని కొన్న విషయం తెలుసుకదా! కాలేయంలోని జీన్స్ హక్కుల్ని కొన్న ఫ్రాన్స్ జెరీన్ సంస్థ మొదటిసారిగా ఇండియాలోకి... అదీ ఏ.పి.లోకి రాబోతోంది. ఆ కంపెనీ పెట్టుబడి పెట్టి సర్వాయిపల్లెలో జన్యుపరమైన మార్పులతో కూరగాయ తోటల్ని పెంచబోతోంది. కాలేయానికి సంబంధించిన వ్యాధులకు టాబ్లెట్స్ కాకుండా ఈ జెనెటికల్లీ మాడిఫైడ్ ఫుడ్‌ను పొందుతారు." ఎడిటర్ గొంతులో జీర.

ఏ కంపెనీకైనా ఇండియా మీదనే కన్ను! ఇక్కడి నిరక్షరాస్యతను, జనాభాను పెట్టుబడిగా వాడుకుంటున్నారు. కొన్నేళ్ళక్రితమైతే వరుసగా ఇక్కడి యువతులకు 'అందాలరాణి' కిరీటాలిచ్చి కాస్మోటిక్స్ అమ్ముకుని కోట్లు గడించారు. రోగానికి ఒక టాబ్లెట్ వేసుకునేకంటే ఒక టమాటా తినడం మంచిదే! కానీ ఈ ఫుడ్స్ రెండు రోజుల కంటే నిలువ వుండవు. అభివృద్ధి చెందిన వర్గాలైతే ఫ్రిజ్‌లలో భద్రపరచుకుంటాయి. మామూలు జనం అజాగ్రత్తగా కుళ్లిన పండ్లను తింటే అదనంగా ఎన్నో రోగాలొస్తాయి.

"వింటున్నావా....?"

ఉలిక్కిపడి 'ఎస్.సర్' అన్నాను. ఎల్లక్క నా వైపు దీనంగా చూస్తోంది.

"ఆరోగ్యాన్ని అందించడం కాదు. కొత్త రోగాన్ని కలిగించడం... డబ్బు సంపాదించడం ఈ కంపెనీ ఉద్దేశ్యం... ఈ విషయం ప్రభుత్వానికి కూడా తెలుసు. ఎన్.టి.పి.సి. ఆధునికీకరణ పేరిట పెట్టిన పెట్టుబడుల్ని వెనక్కి తీసుకుంటుందన్న భయంతో నోరు మెదపడం లేదు" ఎడిటర్ అన్నాడు.

"ఇలాంటివి దేశంలోకి రాకుండానే అడ్డుకోవాలి. వచ్చాక వాటి వికృత చేష్టలు ఆపడం ఎవరితరం కాదు. ఇదే కంపెనీ రేపు 'బేబీ డిజైనింగ్'తో ముందుకు రావచ్చు. తినేతిండి, పీల్చేగాలి, తాగేనీరు.. ఎలాగూ మనవి కాకుండా పోయాయి. కొన్నిరోజులైతే పుట్టేబిడ్డలో కూడా కృత్రిమత్వమే! సర్వేకు వచ్చే బృందాన్ని అడ్డుకునేలా జనాన్ని పోగు చేస్తాను. ఉద్యమాన్ని లేవనెత్తుతాను." చెప్పి జేబులో సెల్‌ఫోన్ పెట్టుకుని పిచ్చివాడిలా రోడ్డు మీదికి పరుగు తీసాను. చెప్పులు జారిపోయాయి. తారు మీద కాళ్ళు సుర్రుమన్నాయి.

"మోకాలి మంటి బురద. ఈ రోడ్డునైనా బాగు చేసుకోరయ్యా మీరు. శ్రమదానం, జన్మభూమి... ఎన్నెన్ని పథకాలున్నయి..." స్కూటర్ గేరు మారుస్తూ విసుగ్గా అంటే ఒకప్పుడు..

వెంట ఉపసర్పంచ్ ఉన్నాడు. ఎం.ఆర్.ఓ. ఆఫీసు ముందు ధర్నా తర్వాత ఇంటికి వస్తున్నాం. చుట్టూ పొలాలు... కాలువలు గలగల చప్పుడు.

"వర్ల్డ్ బ్యాంక్ నిధులు మంజూరయ్యాయి సార్... సర్వే పూర్తయింది. మా ఊరు మీదుగా సిరిసిల్ల మెయిన్ రోడ్ వరకు... ఈ రోడ్డు పూర్తయితే ఊరు మస్తు డెవలపయితది." సంతోషంగా అన్నాడు.

"సారూ... అసలు వడ్లరేటు ఎందుకు పడిపోయిందంటవు. సగం రేటుకు కొనుమన్నా ఎవరూ కొనడం లేదు." తనే అడిగాడు కొద్దిసేపటికి.

"అదో పెద్ద కథ నారన్నా... ఆర్థిక సరళీకృత విధానమని మొదలు పెట్టి విదేశాల పెట్టుబడుల్ని ఆహ్వానించారు. డబ్ల్యు.టి.వో. ఒప్పందమని ఒకటివచ్చింది. ఏ వస్తువును ఎక్కడైనా అమ్ముకోవచ్చు. అప్పుడు ధాన్యం రేటు మన దేశంలో కంటే ప్రపంచ మార్కెట్ల ఎక్కువ ఉండె. అక్కడికి ఎగుమతి చేసి లాభాలు పొందవచ్చునని డబ్ల్యు.టి.వో.లో చేరింద్రు అదొక కుట్ర అని తెలిసి కూడా! తీరా చేరినాక పెద్ద దేశాలు తమ రైతులకు అరవై నుండి ఎనభై శాతం దాకా సబ్సిడీలు ఇచ్చి రేట్లను పూర్తిగా తగ్గించారు. ఇక్కడ మాత్రం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి సబ్సిడీలు తగ్గించి, కరెంటు, ఎరువుల రేట్లు పెంచుతున్నారు. మద్దతు ధర ఎక్కువై మన ధాన్యానికి మార్కెట్ లేకుండా పోయింది. లక్షల టన్నుల ధాన్యం గోడౌన్‌లలో మూల్గుతుంది. మన దేశంలో కూడా చౌకగా వచ్చే విదేశీ ధాన్యానికే గిరాకీ పెరిగింది." వివరంగా చెబితే...

"ఇప్పుడే ఇట్లుంది. ఇంకో ఐదారేండ్లు ఆగితే ఎట్లుంటదంటరు." భయం భయంగా అడిగాడు.

"అప్పటివరకు రక్షణ శాఖ... అంటే పోలీసోళ్లది. అదొక్కటి తప్ప మిగిలినవన్నీ ప్రైవేట్ అయితవి. ప్రజాపంపిణీ వ్యవస్థ, ఎఫ్.సి.ఐ. రద్దయితది. సాంప్రదాయపు పంటల స్థానంలో వాణిజ్యపు పంటలు వస్తయి." అప్పుడు ఈ విషయాన్నే అర్థమయ్యేట్టు చెప్పాను కానీ కార్పొరేట్ వ్యవసాయం గురించి చెప్పలేకపోయాను. అది అప్పుడు నేను ఊహించి ఉండను.

ఇప్పుడు పొలాల హద్దుల్ని చెరిపి డచ్‌కంపెనీ పెట్టుబడులతో డ్రిప్ ఇరిగేషన్ అమలు చేసి కార్పొరేట్ వ్యవసాయం మొదలెట్టింది ప్రభుత్వం. రైతులు తమ పొలాల్లోనే కూలీలుగా మారారు. గులాబీ పూలను ఎగుమతి చేసి వారికి జీతాలిస్తుంది. హోంనీడ్ సంస్థలు అవసరాలను తీరుస్తున్నాయి.

పరుగులాంటి నడక. ఊరిలోకి అడుగుపెట్టేసరికి తలపోటు ఎక్కువయింది. రెండు మాత్రల్ని మింగాను. ఊరు కొత్తగా ఉంది. రద్దీగా వుంది. ఇంతకుముందు రైస్ మిల్లు వున్న చోట కార్పొరేట్ కంపెనీ బోర్డు కనిపించింది. ఫెర్టిలైజర్, పెస్టిసైడ్‌ల షాపుల పేర్లు మాత్రమేమారాయి. కిరాణాలు సూపర్ మార్కెట్లుగా, హోంనీడ్స్‌గా మారాయి. శిశుమందిర్‌లు కాన్వెంట్లుగా మారాయి. వీరంతా రూపాంతరం చెందారు. అప్పుడూ ఇప్పుడూ బాగానే వున్నారు. ఈ ప్రపంచీకరణ పరిణామంలో నలిగిపోయింది రైతులు, కూలీలే! సినిమాలకి, పరిశ్రమలకి, ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీకి సబ్సిడీలు పెంచిన గవర్నమెంటు రైతులకు మొండిచెయ్యి చూపింది. కంప్యూటర్‌లకు లోన్ ఇచ్చి ఎరువు, విత్తనాల సబ్సిడీ ఎత్తేసింది.

"హలో.. నమస్తే సర్! నన్ను గుర్తు పట్టారా...? నేను లింగారెడ్డిని" ఎదురుగా వస్తూ సర్పంచ్. అప్పుడు కూడా ఇతడే సర్పంచ్. ప్రజాస్వామ్యం అన్నపదానికి గుర్తుగా ఎన్నికలు మాత్రం జరుగుతున్నాయి ఇప్పుడు.

"నమస్తే బాగున్నారా...?" పలకరింపుగా అన్నాను.

"ఏదో మీదయ" నవ్వుతూ అన్నాడు.

ముందుగా సర్పంచ్‌కు అర్థమయ్యే రీతిలో చెప్పాలి. ఫ్రైడే ఎల్లుండే! రైతుల్ని సమీకరించాలి. ఆమరణ దీక్ష సాగించాలి "ఇంటికి వెళ్దామా...? మీతో చాలా మాట్లాడాలి" అన్నాను.

ఇద్దరం ఇంటివైపు నడిచాం.

"రైతుల జీవితాలు ఎంతగా మారిపోయాయి. సొంతపొలంలోనే కూలీలుగా బతుకుతున్నారు. తిండిపెట్టే రైతుకు తిండిగింజలు కరువయ్యాయి. చచ్చాక సమాధి కట్టడానికి స్వంత భూమిలోనే హక్కులేదు. రైతు తన భూమికి ఎందుకు దూరమయ్యాడు" ఆవేదనగా అడిగాను.

"ఇప్పుడేమైంది సార్... గులాబీ తోటల్లో లక్షల లాభాలు. జీతాలు బాగానే వున్నాయి. తక్కువో ఎక్కువ దరో కానీ అన్నీ రెడీమేడ్‌గా దొరుకుతున్నయి. జీవితం సుఖంగనే ఉంది"

"ఏది సుఖం.. చిన్నా పెద్దా కలిసి చేసుకుని తిండిగింజల్ని పండించుకునే వారికి ఇప్పుడు పని చేయడానికి రిక్రూట్‌మెంట్, అర్హతలు, ట్రైనింగ్‌లా..? ఇదేనా సుఖం" బాధగా అన్నాను.

"ఏం చేస్తం సారూ.. మన చేతుల ఏముంది...? ఎట్ల జరిగెడిదుంటే అట్లే జరుగుతది. మనం ఆపితే ఆగుతదా..." నిరాసక్తిగా అన్నాడు. అతడివైపు విచిత్రంగా చూసాను. టీకప్పులు వచ్చాయి.

నాకు బాగా గుర్తు. అప్పుడు కూడా ఇదే మాట. వడ్ల వ్యాపారం చేసేవాడు. రైతుల ఫెర్టిలైజరు, పెస్టిసైడుల ఖాతాలన్నీ ఇక్కడే! వడ్ల ధరల గురించి మాట్లాడుతున్నాం అప్పుడు.

బయట జీపులో అనౌన్స్‌మెంట్. 'ప్రభుత్వం క్వింటాలుకు ఐదువందల నలభై రూపాయల మద్దతు ధర ప్రకటించింది. రైతులు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోకూడదు. దళారులను నమ్మి మోసపోకూడదు.

"ఇదేంటిసారూ.. చాట్ల తౌడు పోసికుక్కలకు కొట్లాట పెట్టుడు. వాళ్లు కొనరు. ఇంకొకరిని కొననియ్యరా!"

సర్పంచ్ అడిగాడు. నిజమే అనిపించింది.

ఎక్కడో ఏదో జరుగుతుంది. ఒకవైపు ధాన్యపు నిలువలేంటి? మరోవైపు ఆకలిచావులేంటి..? వరి ధాన్యపు నిలువలు కొనుగోలు లేక కల్లాల్లో, ఇళ్లల్లో తడిసి బూజు పడుతున్నాయంటే న్యూస్ రాయడానికి ఆ ఊరికి వెళ్లాను. రైతులతో పరిచయాలు పెంచుకుని ఎం.పి.పి. ముందు ధర్నా చేయించాను. ఫలితంగా ఊరిలో ఎఫ్.సి.ఐ. కౌంటర్ తెరిచారు. పాస్‌బుక్‌లు, షాంపిల్లతో రైతుల పడిగాపులు.

కేవలం వందమందికే చిట్టీలు పంచారు. మనిషికి ఒక్కొక్క ట్రాక్టర్‌లోడు మాత్రమే! ధాన్యంలో తేమ వుందని, పీలలుగా వున్నాయని, మట్టి పెల్లలున్నాయని వచ్చిన ధాన్యంలో సగం వాపసు.

"సర్! నేను రైతు సంఘం జిల్లా ప్రెసిడెంట్‌ను. కేవలం వందమంది రైతుల దగ్గర మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అదీ పండిన ధాన్యంలో సగం కూడా కాదు. మిగిలిన వారు ఏం కావాలి...?" ఆవేశంగా అడిగాను.

"ఈగోడౌన్ కెపాసిటీ ఇంతే! పై నుండి ఎప్పుడు ఆర్డర్ వస్తే అప్పుడు కొత్త కౌంటర్"

"వానలు పడుతున్నాయి. ధాన్యం తడిసిపోతుంది. ఆర్డర్‌లు ఎప్పుడొస్తాయి" అడిగాను.

"ఇలాగైతే వాళ్లు వినరు. పదండి రాస్తారోకో చేద్దాం" ఒకరైతు గర్జన.

దేశానికి వెన్నెముక అన్నదాత. ఇప్పుడు వెన్ను విరిగింది. ప్రజలారా ఆదుకోండి. అన్నదాతా సుఖీభవ! రైతే రాజు. రాజు రోడ్డున పడ్డాడు. నినాదాలు అరుపులు. పేపర్ల నిండా ధర్నాలు. గోడౌన్‌ల ముట్టడి, ఘెరావ్‌ల వార్తలే.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. మనసులో ఏవో ఆలోచనలు. కొబ్బరి చెట్లకు పుట్టినిల్లయిన కేరళలోకి కొబ్బరికాయలు దిగుమతి అవుతాయట! ఐదువందల కోట్ల టన్నుల ధాన్యపు నిలువలున్న మన దేశం అదనంగా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలట! సి.ఐ.ఐ., అసోచామ్, ఎఫ్.ఐ.సి. కంపెనీలు భారత్‌లో కార్పొరేట్ వ్యవసాయం మొదలెడుతాయట! వీటికి కారణాలేంటి...? ఫలితాలేంటి..?

"టీ చల్లారిపోతుంది. తీసుకోండి సార్.." లింగారెడ్డి మాటలతో సింథటిక్ పాలతో చేసిన టీని అందుకున్నాను. సర్పంచ్ ఇపుడు వ్యాపారిగా మారిపోయాడ్డనడానికి గుర్తుగా ఇంట్లో తట్టా, బుట్టా, తక్కడి బాట్లు.

"నమస్తే సర్... నన్ను గుర్తు పట్టారా...? శేఖర్‌ని!" అప్పుడే వచ్చాడు సర్పంచ్ కొడుకు.

"ఎం.సి.ఏ. పూర్తయింది. జన్మభూమి మీటింగ్‌లో ఒకసారి రైస్‌మిల్ ఓనర్ని అవుతానన్నాడు చూడు. వాడేవీడు." చెప్పాడు లింగారెడ్డి నవ్వుతూ గర్వంగా.

అతడి వైపు పరిశీలనగా చూసాను. తోటకూర కాడలా పెరిగాడు. అప్పుడు చిన్నవాడైనా చాలా పెద్ద మనసుతో అన్నాడు.

"రేపు జన్మభూమి మీటింగ్. ఆర్.డి.ఓ. వస్తున్నాడు. ధాన్యం కొనాలని ధర్నా చేద్దాం" రైతులతో అన్నాను. అప్పటికే సగం నీరసించిపోయారు. కొందరి ధాన్యం కొట్టుకుపోయింది. మిగిలిన వారు ఆశలు వదులుకున్నారు. యంత్రాల్లా నావెంట వచ్చారు. ఇంటర్లో స్టేట్ ర్యాంక్ తెచ్చుకున్నందుకు కాలేజీ తరఫున జన్మభూమిలోనే శేఖర్‌కు సన్మానం.

దండవేసి సత్కరించాక "నువ్వు ఏం కావాలనుకుంటున్నావు..?" ఆర్.డి.ఓ. ప్రశ్న. "రైస్‌మిల్లు ఓనర్ని కావాలనుకుంటున్నాను. ఈ రైతుల ధాన్యమంతా మద్దతు ధరకు కొని ఆదుకుంటాను. అతడి పరిధిలో జవాబు.

వెనుకనుండి ఈలలూ, చప్పట్లు, అరుపులు. నినాదాలు, రైతులు ఆర్.డి.ఓ.ను చుట్టుముట్టారు. అధికారులు కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెళ్ళారు. వృద్ధాప్య పింఛన్ల కొరకు వచ్చిన వారు రైతులను శాపనార్థాలు పెట్టారు.

ధాన్యం ఎవరూ కొనలేదు. వరుసగా రెండు ఫసళ్ళు ధరలు లేకపోవడం, మొన్‌సాంట్, పయనీర్, ఆగ్రోఫోరస్, బోల్‌గార్డ్, టెర్మినేటర్ విత్తనాల ప్రయోగాలతో వాణిజ్య పంటలవైపు దృష్టి మరలింది.

"రైస్‌మిల్లు ఓనర్ని అవుతానని సాఫ్ట్‌వేర్ ఇంజనీరయ్యావా....?" నవ్వుతూ అన్నాను కప్పును కింద పెడుతూ.

"చెప్పండి...! ఏదో విషయం మాట్లాడాలన్నారు కదా!" అడిగారు సర్పంచ్. వీల్ చైర్లో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు.

ప్రభుత్వం జెనెటికల్ ఫుడ్స్ ప్రాజెక్టును ఇక్కడ అనుమతివ్వాలని చూస్తోంది. ఈయేటితో డచ్ కంపెనీతో కుదుర్చుకున్న పూల కాంట్రాక్టు పూర్తవుతుంది. ఫ్రాన్స్‌కు చెందిన జెరీన్ కంపెనీ ఇక్కడ కూరగాయల్ని పండించాలని చూస్తోంది. అవి మామూలు కూరగాయలు కావు. జెనిటికల్లీ మాడిఫైడ్ ఫుడ్స్" పరిశీలనగా అతడివైపు చూసాను.

"అయితే మంచిదేగదా సార్! ఈ పూల పంటకంటే నయం" చెప్పాడు లింగారెడ్డి.

"చెప్పానుగా. అవి మామూలు కూరగాయలు కావని. వీటి సాగులో పెద్దఎత్తున రసాయనాలు వాడాలి. నీటి వాడకం కూడా చాలా ఎక్కువ. ఈసాగు మొదటిసారి ఫ్రాన్స్‌లోనే మొదలయింది. రెండు పంటలకే భూగర్భ జలాల్లోకి నైట్రేటులు చేరుకుని నీటి కాలుష్యం, వాతావరణ కాలుష్యం మొదలై ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. అక్కడ ఆపేసి తెలివిగా ఆ ప్రాజెక్టును ఇక్కడికి తేవాలని చూస్తున్నారు. వాటిని తినడం వల్ల కూడా ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి."

ఎవరో వచ్చారు. వారితో కొద్దిసేపు మాట్లాడాక అన్నాడు సర్పంచ్ లింగారెడ్డి.

"పోరాటాలు, ధర్నాలు, చివరికి ఆత్మహత్యలు కూడా ప్రభుత్వ నిర్ణయాలను మార్చలేవని ప్రజలకు తెలిసిపోయింది సార్! అదొక విధంగా నిరాశలోంచి పుట్టినదే కావచ్చు. అయినా చివరి నిర్ణయంగా మారిపోయింది. చెప్పింది చేయడం అలవాటైపోయింది. అంతకంటే చేసేదేం లేదని కూడా తెలిసిపోయింది. ఒకప్పుడైతే ఆయుధాలతో యుద్ధాలు చేసి దేశాలను ఆక్రమించుకునే వారట. ఇప్పుడా పద్ధతి మారిపోయింది. వ్యాపారంతో దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి బానిసలుగా మార్చుకుంటున్నారు. మనమెప్పుడో ఆక్రమింపబడ్డాం సర్!" లింగారెడ్డి కళ్ళల్లో నీళ్లు.

అతడిని ఒప్పించి రైతు చర్చా మండలి వరకు తీసుకుపోయాను. ఈ మధ్య అందులో మనుషులు మెదిలిన దాఖలాలులేవు. కరెంటు ఉద్యమం, వడ్ల మద్దతు ధర ఉద్యమం సాగినప్పుడైతే అదే నాకు నివాసం. లోపల కూర్చోడానికి వీలులేక బయటే కూర్చున్నాను. రైతుల్లో కొందరు కొత్త, కొందరు పాత, అయినా అందరూ నన్ను కొత్తగానే చూస్తున్నారు.

"ఆ పంటల్ని ఇక్కడ పండిస్తే మనం పీల్చుకునే ఈ గాలి కూడా పనికి రాకుండా పోతుంది. అదొక్కటే ఇప్పుడు మనకు ఫ్రీగా దొరుకుతుంది. ఇప్పుడు మనం కొనుక్కు తాగుతున్న మినరల్ వాటర్ కూడా కలుషితమైపోతాయి. ఇప్పటికే అన్నింటికీ దూరమైపోయాం. కనీసం ఈ గాలి, నీరు కొరకైనా పోరాడుదాం. వీటిని తినడం వల్ల వచ్చే పరిణామాలను కూడా అడ్డుకుందాం. వాడి దేశంలో పనికి రాని పంట మన దేశంలో ఎందుకు పండించాలనుకుంటున్నాడో అడుగుదాం..." ఆవేశంగా అన్నాను. రైతుల్లో స్థబ్దత!

మరునాడు పొద్దంతా తిరిగితే తప్ప అందరూ ఏకం కాలేదు. శుక్రవారం పొద్దునే ఊరేగింపు.

"స్వాతంత్ర్యం వచ్చే నాటికి షిప్‌టు మౌత్‌గా విదేశీ ధాన్యం కొరకుఎదురు చూసే వాళ్లం. హరిత విప్లవం ద్వారా కోట్ల టన్నుల దిగుబడి సాధించుకున్నాం. ప్రపంచ వాణిజ్య సంస్థల గుత్తాధిపత్యానికి ద్వారాలు తెరిచి అదీ పోగొట్టుకున్నాం. వాణిజ్య పంటలతో తిండిగింజలను, కార్పొరేట్ వ్యసాయంతో స్వంత భూములపై హక్కులను పోగొట్టుకున్నాం. రేపు జెనెటిక్ ఫుడ్స్ తర్వాత శరీరంలోని భాగాలపై హక్కును, బేబీ డిజైనింగ్ తర్వాత పుట్టబోయే బిడ్డపై మమకారాన్ని కోల్పోబోతున్నాం. వాటిని ఆపేంతవరకూ మన పోరాటం ఆగకూడదు...." స్వాగతోపన్యాసంతో ర్యాలీ మొదలయింది.

పోరాటం, ర్యాలీ, ధర్నా... హక్కులు... ఈ పదాలు వింటుంటే వింతగా కొత్తగా కొత్తగా చూస్తున్నారు రైతులు. అందరికీ అదొక తమాషాలా అనిపిస్తుంది. గోబ్యాక్ నినాదాలతో కార్ల అడ్డగింపు... అరెస్టులు, విడుదలలు... నేను ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నాను.

తెల్లవారే పేపర్లో ఫొటోలు, వార్తలు, రాత్రికి రాత్రే నిర్ణయాలు. తెల్లవారే ప్రభుత్వానికి బెదిరింపులు. ఎ.పి. ట్రాన్స్‌కోను మూసివేస్తున్నట్టు జర్మనీ ప్రకటన. రైలు ఛార్జీలను పెంచుతున్నట్టు ఫ్రాన్స్. ఆర్.టి.సి.లో పెట్టుబడుల్ని నిలిపివేస్తున్న స్విస్, ఎరువుల్ని, గోధుమలు, బియ్యం సరఫరా ఆపేస్తున్నట్టు అమెరికా!.. ఇవన్నీ ప్రైవేట్ పరమైపోయాక పెట్టుబడుల్ని పెట్టి ఆయా దేశాలు ఆక్రమించుకున్నాయి.

మరునాడే అత్యవసరంగా పార్లమెంటు సమావేశం! చట్టాల సవరణ.

అత్యవసరంగా ఐదేళ్ళపాటు ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, దీక్షలను నిషేధించారు. గంటల మీద బిల్లు అమలు. ఏ కంపెనీ అయినా సరే! వారి నిర్ణయాలను వ్యతిరేకిస్తే మిగతా వారు ఊర్కుండరు. ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా ఏకుమేకైపోయి తమ దాకా కూడా వస్తుందని వారి భయం. అందుకే ఆక్రమించుకున్న దేశాలన్నీ ఏకమైపోయాయి.

ప్రజాస్వామ్యంలో మిగిలిన ఒకే ఒక 'పౌరహక్కు'ను కూడా వాళ్లుకొన్నారు. అసాధ్యమని నేను అనుకున్న దాన్ని కూడా వాళ్ళు సుసాధ్యం చేసుకున్నారు. ఇది కలలో కూడా నేను ఊహించని పరిణామం.

'మనమెప్పుడో ఆక్రమింపబడ్డాం సార్....' సర్పంచ్ మాటలు గుర్తుకొచ్చాయి. నాచేతికి బేడీలు పడ్డాక కూడా తెలియదు. నేను ఏ నేరం కింద అరెస్టు అయ్యానో అని! బహుశా 'టాడా' అయి ఉండవచ్చు. ఈ వార్త రేపు పేపర్లో కూడా రాదు. కారణం....? ★



కలం శ్రామికుడు - శ్రామికుల కథకుడు

తీర్చి దిద్దిన తిరునామాలతో చొక్కా లేకుండా ఉత్తరీయం కప్పుకొని వుండే ఆయనను మొదటిసారిగా చూసిన వారు ఎవరో పౌరోహిత్యానికి వెళ్తున్నారు కామోసనుకుంటారు. కాని వెనకాలే వెళితే ఆయన ఏ పౌర హక్కుల సభలో మాట్లాడ్డానికో లేక రాజ్యహింసను ఖండించడానికో లేక మరేదో ప్రగతి శీల సాహితీ కార్యక్రమాన్ని ప్రారంభించడానికో వెళ్తుంటారు. ఆయన సుప్రసిద్ధ నవలా రచయిత దాశరథి రంగాచార్యులు అని తెలుసుకున్నాక వారు మరింత ఆశ్చర్య పోతారు.

ఆయన శ్లోకాలను ఉటంకిస్తూ సోషలిజం పట్ల తిరుగులేని నిబద్ధత ప్రకటిస్తారు. మంత్రాలను విశ్లేషిస్తూనే మార్క్సిజమే మార్గమని ఘంటాపథంగా చాటిచెబుతారు.

మన మధ్య నడయాడుతున్న మహా రచయితలలో అత్యున్నత స్థాయికి చెందిన వారు దాశరథి అంటే అణుమాత్రం అతిశయోక్తి లేదు. మహీధర మరణం తర్వాత పాత తరంలో ఆ స్థాయి నవలా కారులు మరి లేరు. డెబ్భై ఏళ్లు దాటినా అవిశ్రాంత పథికుడుగా కథికుడుగా అక్షర జగత్తుకూ, ఆచరణకు కూడా తన వంతు దోహదం అందిస్తున్న వ్యక్తి దాశరథి.

1928 ఆగష్టు 24న వరంగల్ జిల్లా చినగూడూరులో సనాతన కుటుంబంలో జన్మించిన దాశరథిరంగాచార్యులు, ఆయన అన్న కృష్ణమాచార్యులూ ఉభయులూ తెలంగాణా పోరాటంలో పాల్గొన్న వారు. ఆరవ తరగతిలోనే ఆయన నిజాం వ్యతిరేక సమ్మెకు నాయకత్వం వహించారు. నిషేధాజ్ఞలు ధిక్కరించి మీజాన్, ప్రజాశక్తి వంటి పత్రికలు తెప్పించడం, గ్రంథాలయాలు నడపడం తదితర కార్యక్రమాలలో ధైర్యంగా పాల్గొన్నారు. బాల్యంలో అనేక కష్టాల మధ్యనే చదువుకున్నారు. 17 ఏళ్ల వయసులోనే దాశరథి అరెస్టు అయి కూడా సహృదయుడైన ఒక పోలీసు కారణంగా తప్పించుకోగలిగారు. అజ్ఞాత వాసంలో వుంటూ పోరాటం కొనసాగించిన దాశరథి పోలీసు చర్య అనంతరం స్వయం కృషితో బిఎబిఎల్ పూర్తి చేశారు. అభ్యుదయ రచయితల ఉద్యమంలో అనేక బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాదు మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్‌గా 1988లో పదవీ విరమణ చేశారు. ఉద్యోగుల సంఘాలలోనూ ఆయన ముఖ్య బాధ్యతలు నిర్వహించారు. కళా సాహిత్య విషయాలలో ప్రభుత్వ సలహా సంఘాలు పెక్కింటిలో సభ్యులుగా వున్నారు. కాకతీయ యూనివర్శిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది.

1969 లో 'చిల్లర దేవుళ్లు' నవలతో దాశరథి రచనా యజ్ఞం ప్రారంభమైంది.దీనికి వెనక చాలా కథ వుంది.ఆయన వట్టికోట ఆళ్వారు స్వామికి అప్తుడు. ఆళ్వారు స్వామి 'ప్రజల మనిషి' నవలను అర్ధంతరంగా ముగించి కన్నుమూయడంతో తెలంగాణా జీవిత చిత్రణ కొనసాగించాలని సంకల్పించారు. చిన్ననాడే సంస్కృత సాహిత్యం చదివి కావాలని వాటిని మరచి పోయిన దాశరథి బయటకు వచ్చాక మళ్ళీ రామాయణ భారతాలు చదివారు. నవలా ప్రక్రియ గురించి చాల శ్రద్ధగా అధ్యయనం చేశారు."హౌటు రీడ్ ఎ నావల్ "అనే పుస్తకం క్షుణ్ణంగా తిరగేశారు."నేను ఏదో యాదృచ్ఛికంగా రచయితను కాలేదు. కావాలని అయ్యాను" అని అంటారు. "ఉద్యమమే నన్ను ఉరికించింది. ప్రజలు నన్ను తమ వాణ్ణిగా చేసుకున్నారు.వారే నాకు పాఠాలు నేర్పారు" అనే దాశరథి 1938లో నైజాం సంస్థానంలో స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావం నాటి పరిస్థితిని నేపథ్యంగా తీసుకుని "చిల్లర దేవుళ్లు" రాశారు. అప్పటి వరకు వచ్చిన తెలంగాణా కథలకు భిన్నంగా స్థానిక భాషను ఉపయోగించారు. భాష పట్ల, మాండలికాల పట్ల, తెలుగు భాష చారిత్రిక వారసత్వం పట్ల ఆయనకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. చిల్లర దేవుళ్లు చదివి డి.వి.నరసరాజు "మేమెవ్వరం ఇలా రాయలేం" అన్నారు! తర్వాత అది సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. చలన చిత్రంగానూ వచ్చింది.

ఇంత విశిష్టమైన చిల్లర దేవుళ్లు మొదట అనేక సమస్యలు ఎదుర్కొంది. దాశరథి మొదట దాన్ని రాతిమనుషులు అనే పేరిట రాసి ఆంధ్రప్రభ వార పత్రికకు పంపారట. అప్పట్లో నవలలకు వారపత్రికలే మూలాధారం. కాని ఆ పత్రిక దాన్ని తిప్పి పంపింది. ఆయన దాన్ని అలాగే అట్టిపెట్టుకున్నాడు. చాలా కాలం తర్వాత నార్ల చిరంజీవి చూసి ఎంతో ఉత్తేజపడి అప్పట్లో మద్దుకూరి చంద్రం గారి సంపాదకత్వంలో వెలువడుతున్న ప్రగతి వార పత్రికకుపంపారు.అది అందరి ఆదరణ పొందింది. ఆయన ఇక మళ్లీ వెనక్కు చూడలేదు. చిరంజీవి తనకు ఇచ్చిన ప్రోత్సాహాన్ని దాశరథి ఎంతో కృతజ్ఞతగా రాయడం ఆయన నమ్రతకు, స్నేహశీలతకు తార్కాణం. మోదుగుపూలు (1971) మారుతున్న పరిస్థితులలో ప్రజల మనోభావాలలో వస్తున్న మార్పును ప్రతిబింబించే నవల.

నగ్జలిజం నేపథ్యంలో తెలంగాణా పోరాటంతో ప్రారంభించి యువతను నిరాశా నిస్పృహలలోకి నెడుతున్న సామాజిక వ్యవస్థ పరిణామాన్ని చిత్రించిన రెండు భాగాల నవల "జనపదం"(1976).ఇది ఆంధ్రజ్యోతిలో సీరియల్‌గా వస్తుండగా సంపాదకులు పురాణం ఆసక్తికరంగా లేదని ఆపేయాలని సూచిస్తూ వుత్తరం రాశారట. మళ్లీ ఆయనే రాష్ట్రంలో ఏదో పర్యటనకు వెళ్లి వచ్చాక అది పాఠకులనుఎంతగా ఆకర్షించుతున్నదీ ప్రత్యక్షంగా తెలుసుకుని మరింత కాలం కొనసాగించమని కోరారని దాశరథి తన జీవనయానంలో రాశారు. రచయితలు నిలదొక్కుకోవడంలో వుండవలసిన దృఢ విశ్వాసం ఆయనకు మెండుగా వుందని ఈ ఉదాహరణలు చెప్తాయి.

దోపిడీ రంగు మార్చుకుందని, కాపిటలిజమే సోషలిజంగా చలామణి అవుతోందని చెప్పడానికి మాయ జలతారు(1973) రాశారు. రానున్నది ఏది నిజం?(1974)లో సోషలిజమేనని సందేశమిస్తారు.ఇంకా అనేక నవలలు రాసిన దాశరథి సోవియట్ పరిణామాల తర్వాత కూడా సోషలిజంపై విశ్వాసం ప్రకటించే తీరు ఉత్తేజం కలిగించుతుంది."..... ఏమైనా సోషలిజం బతుకుతుంది.అదొక ప్రత్యామ్నాయ ఆర్థిక సిద్ధాంతం. జీవన విధానం. సోవియట్‌లో విచ్ఛిన్నమై వుండొచ్చు.75 ఏళ్ల తర్వాత ఎందుకు పోయిందని బాధపడటం కంటే ఈ అమెరికా రాక్షస దాడిని తట్టుకుని అన్నేళ్లు నిలబడటంలోని గొప్పతనాన్ని గుర్తించాలి.రేపు మరేదైనా సోషలిస్టు దేశానికి దెబ్బ తగలవచ్చు. చరిత్రలో అలాటి ఆటుపోట్లు సహజం. సిద్ధాంతాల మంచి చెడ్డలు ఆచరణ మీదనే ఆధారపడి వుండవు.అక్షరాలా మార్క్సు చెప్పిన ప్రకారమే సోషలిజం రాలేదు.కనుక సోషలిజం బతికే వుంటుంది.దానికి చావు లేదు" అని అత్యంత స్పష్టంగా చెప్పడం ఆయన పరిణితిని, విశ్వాసాన్ని ప్రతిబింబించుతుంది. ఈనాటి ప్రపంచ పరిస్థితులలో సామ్రాజ్య వాదం దూకుడును, పాలకవర్గాల దాడిని సమైక్యంగా ఎదుర్కోవాలని చెప్పే దాశరథి అందుకు ఉద్దేశించిన వామపక్ష కార్యక్రమాలకు సంఘీభావం ప్రకటించడంలో ముందుంటారు.

ప్రారంభంలో చెప్పుకున్నట్టు చూడ్డానికి సంప్రదాయవాదిగా అనిపించే దాశరథి తాను చేసేది సంప్రదాయాన్ని వ్యాఖ్యానించడమేనని అంటారు. అయితే సంప్రదాయవాదిగా వుండటం నేరమేమీ కాదని, దేశంలో కమ్యూనిస్టు ప్రభుత్వం వచ్చినపుడు తాను మతాన్ని వదులుకోవడానికి సిద్ధమేనని చెబుతారు. అన్నిటినీ మించి మతతత్వ రాజకీయాలను నిశితంగా ఖండించుతారు. రామాయణ భారతాలు సులభ భాషలో రాసిన ఆయన "బిజెపి వాళ్లు రాముణ్ని రాజకీయంగా వాడుకుని ఓట్లు పొందుతున్నారు. భారత ధర్మం మీద బిజెపి వాళ్లకున్నంత వ్యతిరేకత ఎవరికీ లేదు...." అని విమర్శిస్తారు. అన్నట్టు వేదానికి ఆయన రాసిన భాష్యం కూడా మతతత్వ వాదులకు నచ్చలేదు. అయినా వారి విమర్శలనుఖాతరు చేయలేదు. పైగా ఆ పుస్తకం రికార్డు స్థాయిలో అమ్ముడైంది! జీవన యానం పేర రాసిన ఆత్మకథలోనూ, వేదం-జీవన నాదం అనే రచనలోనూ ఆయన అనేక శ్లోకాలు, ప్రాచీన గాథలు చారిత్రక సందర్భాలు పొందుపరుస్తారు. అవి ఆయన బహుముఖ ప్రజ్ఞను వెల్లడిస్తాయి. వాటన్నిటితో ఏకీభవించలేక పోవచ్చు గాని ఆయన ప్రాచీన భావాలకు తనదైన మానవీయ వ్యాఖ్యానం ఇవ్వడానికి ప్రయత్నించడం కనిపించుతుందని చెప్పవచ్చు

దాశరథి రచనలపై యూనివర్శిటీలలో పరిశోధనలు జరిగి డాక్టరేట్‌లు లభించాయి. .రచనల గురించి భాష గురించి, శిల్పం గురించి ఆయనకు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి (చూడండి; 2000 ఏప్రిల్, ప్రజాశక్తి 'దర్పణం' సంచికలో ఇంటర్వ్యూ)

"నేను చేసిన దానికి మించి ప్రజలు నన్ను గౌరవించారు.అవార్డులు వచ్చాయి రాలేదన్నది ముఖ్యం కాదు. ప్రాణాలు పోతాయనుకున్నప్పుడే ఉద్యమంలోకి దూకిన వాళ్లం. అవార్డుల కోసం రాయలేదు" అని ధీమాగా చెప్పే ధీశాలి దాశరథి రంగాచార్య. తన సాహితీ ప్రసంగాలతో రచనా ప్రవాహాలతో తెలుగు మాగాణాన్ని చైతన్య క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అంకితమైన అవిశ్రాంత అక్షర యోధుడు. ఆయనే ఉటంకించినట్టు కలం శ్రామికుడు. శ్రామికుల కథకుడు.

(తెలుగు యూనివర్సిటీ విశిష్ట పురస్కారంతో దాశరథిని సత్కరిస్తున్న సందర్భంగా)

- తెర

గుడ్డలూడదీసి గాంధీ విగ్రహం ముందుకు...

యు.రామకృష్ణ

'జాతిపిత' మహాత్మాగాంధీ హత్యగా వింపబడి అప్పటికి ఏణ్ణర్ధమై ఉంటుంది. దేశ స్వాతంత్ర్య సముపార్జనకు నేతృత్వం వహించిన 'మహాత్ముని'గా స్మృతిపథంలో నింపుకునేందుకు ఆ గ్రామం నడిబొడ్డున ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారా ఊరి ప్రజలు.

ఆ గాంధీ విగ్రహం ముందు జరిగిన ఘోరం ...

నోటితో చెప్పలేని... పత్రికలు రాయలేని.... అనాగరికమో.... దారుణమో.... కిరాతకమో... అదిఏదో... పాఠక మహాశయులే నిర్ణయించాలి.

అది ఒట్టి విగ్రహమే కాబట్టి సరిపోయింది. ఆ మహాత్ముడే బతికుంటే... ఆ దృశ్యం తాను చూడకపోయినా, కనీసం వినివుంటే చాలు... విచలితుడై..."హేరామ్" అంటూ... ఆత్మహత్య చేసుకునేవాడని ఇప్పుడున్న చాలా మంది స్వాతంత్ర్య సమర యోధులు చెబుతుంటారు.

స్వాతంత్ర్యం రాకపూర్వం బ్రిటీష్ సామ్రాజ్యవాదులు భారతీయులను పెట్టిన చిత్రహింసలు, జలియన్‌వాలాబాగ్ వంటి దురంతాలు ప్రపంచాన్నే కుదిపివేశాయి. అయితే స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన మన భారత నేతల ఏలుబడిలో జరిగిన ఘోరాలు కూడా తక్కువేమీ కాదు. వీరి ఘోరాలు కొన్ని ప్రపంచాన్ని కుదిపివేసినవి ఉన్నాయి. జుగుప్సాకరమైన... అత్యంత హేయమైన... కొన్ని సంఘటనలు వెలుగుచూడనివీ ఉన్నాయి. ఈ ఘోర సంఘటన ఈ కోవలోదే.

1949వ సంవత్సరం జులై 15వ తేదీన ఆంధ్రలోని అనేక పత్రికలతోపాటు ముఖ్యంగా "ఆంధ్రప్రభ" ఆ ఘోరాన్ని... అత్యంత నీచమైన ఆ కిరాతకాన్ని... లోకానికి వెల్లడి చేసింది.

ఆ ఘోరం... జరిగింది ఏ మోసగాళ్ళ మీదో... దుర్మార్గుల మీదో కాదు.. దేశ ద్రోహులమీద అంతకంటే కాదు... కనీసం దేశమంటే ఏమిటో కూడా తెలియని అమాయకుల మీద... సామాన్య జనం మీద జరిగిన దురంతమది.

★★★

"యలమర్రు"

కృష్ణాజిల్లా పూర్వపు గన్నవరం తాలూకా (ప్రస్తుతం పెదపారుపూడి మండలం)లో ఉన్న చిన్న ఊరది.

1949వ సంవత్సరం జులై నెల 14వ తేదీ..

అప్పుడే తెలతెలవారుతున్న సమయం...

సుమారు 200మంది మలబార్ స్పెషల్ పోలీసులు ఊరి బయటనే వాహనాల్లోంచి బిలబిలా దిగారు.

ఆ నీరవ నిశ్శబ్దంలో టకటకమంటూ బూట్ల చప్పుడు.

భుజాలకు తగిలించుకున్న తుపాకులను చేతిలోకి తీసుకుని ఊరు చుట్టూ వలయాకారంగా నిలబడ్డారు.

వారంతా గ్రామంకేసి తుపాకులు ఎక్కుపెట్టారు.

మెలమెల్లగా చీకటి తెరలు విడిపోతుండటంతో గ్రామస్తులు లేచి ఒక్కొక్కరే కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం గ్రామం వెలుపలికి వస్తున్నారు.

అలా వస్తున్న జనం, అల్లంత దూరంలో గ్రామం వైపు తుపాకులు ఎక్కుపెట్టి నిలుచున్న పోలీసులను చూశారు.

భయంవేసి కొంతమంది గ్రామంలోకి పరుగెత్తారు.

తామేం తప్పు చేయలేదు కదా, పోలీసులు ఎవరి కోసమో వచ్చి ఉంటారని భావించి నాలుగడుగులు ముందుకు వేసిన వారిని తుపాకుల మడమలతో కొట్టి, పొడిచి ఊళ్ళోకి పరుగెత్తేలా చేశారా పోలీసులు.

కొత్త బట్టలు వేసుకుని, పిల్లాపాపలతో పొరుగూరికి బయలుదేరిన దంపతుల జంటను కూడా వదలి పెట్టలేదు. వారికీ తప్పలేదు తుపాకీ మడమ దెబ్బలు. ఆ దంపతులు చెరో బిడ్డను చంకన వేసుకుని ఊళ్ళోకి పరుగెత్తారు.

మేకలనూ, గొర్రెలను పొలాలకు తోలుకుపోతున్న వాళ్ళనూ, గుడివాడ, ఉయ్యూరు వంటి చోట్లకు కిరాణా సరుకులు కొనుగోలు చేయడానికి బయలు దేరిన చిన్నవ్యాపారులను, గ్రామం వెలుపలకు ఎవరొస్తే వారినల్లా తుపాకీ మడమలతో పొడిచి మరీ ఊళ్ళోకి పరుగెత్తించారు.

నాటి పోలీసుల దుష్కృత్యానికి ఈ విగ్రహమే సాక్షి

ఊరికి వెలుపల వలయాకారంగా నిలుచుకున్న ఆ మలబారు పోలీసు మూక ఇక ఊళ్ళోకి బయలు దేరేందుకు కదిలింది.

గ్రామ మునసబు వారిని సాదరంగా ఊళ్ళోకి తోడ్కొని వెళ్ళాడు.

స్త్రీ, పురుష వయోభేదం లేకుండా అందరూ గ్రామ హైస్కూలు ఆవరణలోకి చేరుకోవాలని క్షణాలమీద హుకుంలు వెళ్ళాయి.

అప్పటిదాకా గ్రామంలోకి వచ్చిన పోలీసుల సంగతి తెలియని స్థానికులు ఎందుకు వారితో తంటా అని భావించి గుంపులు, గుంపులుగా హైస్కూల్‌వైపు వెళ్తున్నారు. అక్కడికి వెళ్ళడానికి తటపటాయిస్తున్న మహిళలను మునసబు మనుషులు బందబూతులు తిడుతూ హైస్కూల్ వైపు లాక్కెళుతున్నారు.

* * *

నాలుగు వందల మంది జనం వరకూ ఆ స్కూలు ఆవరణలో పోగుపడ్డారు. సుమారు 200 మంది పోలీసులు తుపాకులను పడవేసి చింత బరికెలు పుచ్చుకున్నారు.

ఏ వైపుకీ పారిపోవడానికి వీల్లేకుండా పోగుబడిన జనం చుట్టూ వలయాకారంగా నిలుచున్నారు కొంతమంది పోలీసులు. వలయం లోపలున్న జనంపై చింతబరికెల ప్రయోగం మొదలైంది.

చిన్న పిల్లలన్న విచక్షణ... మహిళలన్న మర్యాద కూడా లేదు ఆ మలబారు పోలీసు కిరాతకులకు.

చింతబరికెల దెబ్బలకు తాళలేక అరుస్తున్న జనంపై రెట్టించిన క్రౌర్యంతో విరుచుకుపడ్డారు.

చిన్న పిల్లల ఏడుపులు... పెద్దల పెడబొబ్బలు... వృద్ధుల హాహాకారాలు, మహిళల రోదనలతో ఆ ప్రదేశం అల్లకల్లోలంగా తయారైంది.

అన్ని వందల మంది జనంలోనూ చింతబరికె వాతలు తేలని వ్యక్తి లేడంటే ఆశ్చర్యమే. ఎందరో వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. ఎవరైనా దెబ్బలకు తాళలేక అరిస్తే మళ్ళీ కొట్టేవారు. అలాగని ఆ బాధను వెళ్ళగక్కకుండా మౌనంగా భరించిన వారిని, వీడికి దెబ్బలు బాగా తగలలేదని కొట్టేవారు. ఆ క్షణంలో పోలీసులకు ఏది తోస్తే అదే అమలు చేసేవారు.

పోలీసులు చింతబరికెలను కాసేపు పక్కన పెట్టారు. పురుషులను వరుసగా నిలబెట్టారు. ఒక్కొక్కరి బట్టలు బలవంతంగా ఊడదీకారు. దానికి అభ్యంతరం తెలిపిన ఒక్కో గ్రామస్తుడినీ చింతబరికెతో పడేసి దెబ్బలు కొట్టారు.

మహిళల ముందే తమను దిగంబరులను చేయడాన్ని భరించలేక... చేతులతో మొఖం కప్పుకొని ఏడ్చినా వారి రోదన అరణ్యరోదనే అయ్యింది.

ఆ సమయంలో అందరూ నిస్సహాయులు. ఆ తరువాత వారిని గ్రామ వీధులలో ఊరేగించారు. కొందరు తమ చేతులతో సిగ్గు దాచుకోవడానికి ప్రయత్నించినా మరలా కొట్టారు.

అలా ఆ దిగంబరులందరినీ గ్రామం నడిబొడ్డున గాంధీ విగ్రహం వద్దకు చేర్చారు.

గాంధీ విగ్రహం ముందు వారిని సాష్టాంగ (ప్రణమిల్ల చేసి) పడవేసి మరోసారి చింతబరికెలతో కొట్టారు.

ఇది జరిగిన తరువాతైనా వారి బట్టలు వారికివ్వలేదు. దిగంబరంగానే మహిళలకు కనిపించి బట్టలు వేసుకొని రమ్మన్నారు.

దారుణమైన ఈ అవమానానికి, దెబ్బలకు, గురైన వారంతా వయోభేదానికి... కులమతాలకు... పేద, ధనిక తారతమ్యాలకు అతీతులు.

మళ్ళీ వారందరినీ హరిజనకాలనీలోని మైదానంలోకి తీసుకువెళ్ళారు. అక్కడ స్త్రీలను వరుసగా నిలబెట్టారు. పురుషులందరినీ మహిళల వద్దకు వెళ్ళి ఎవరి భార్యను వారు తీసుకురమ్మన్నారు.

ఓ 16 సంవత్సరాల వయసుగల తన భార్యను వివస్త్రను చేయవలసిందిగా ఒక యువకుడిని ఆజ్ఞాపించారు. అందుకా యువకుడు నిరాకరించాడు.

ఇక ఆ యువతినే వివస్త్రను కావలసిందిగా పోలీసులు కోరారు. అందుకు ఆమె నిరాకరించింది.

"మీరు నన్ను చంపితే చంపవచ్చు. నన్ను నేను మాత్రం నీచపరచుకోను" అని ఆమె బదులిచ్చింది.

దీనితో ఒక పోలీసు ఆమెను వివస్త్రను గావించబోయాడు. అది చిక్కులకు దారితీస్తుందని హెచ్చరించి గ్రామ మునసబు ఆ దుశ్చర్యను నివారించాడు.

ఆ తర్వాత స్త్రీలను మరలా చింతబరికెలతో కొట్టి ఇళ్ళకు పంపించారు.

ఇక చివరిలో 'కాంగ్రెస్‌కు - జై' అనడానికి నిరాకరించిన వృద్ధ వ్యవసాయ కార్మిక నాయకుడు దావీదును చావమోదారు. ఆయన స్పృహ కోల్పోయే వరకూ 'కమ్యూనిస్టు పార్టీకి - జై' అని నినదిస్తూనే ఉన్నాడు. లెక్కలేనన్ని లాఠీ దెబ్బలతో ఆయనను పడగొట్టారు. ఆయనను అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేశారు. మరొకసారి ఇంకొక దాడిలో ఆయనను పట్టుకొని కొట్టి మరణించాడనుకొని వదిలేశారు. అయితే ఆయన ప్రాణాలు కోల్పోలేదు. ఎర్రజెండాను తన దగ్గరకు తెప్పించుకొని ఆ వీరుడు దానికి వందనం చేశాడు.

ఇది జరిగిన రెండు రోజుల తరువాత 1949 జులై 16వ తేదీన యలమర్రుకు కొద్ది మైళ్ళ దూరంలో ఉన్న పెద్ద గ్రామమైన కాటూరుపై కూడా పైవిధంగానే దాడి చేశారు. అదేవిధమైన ఘోరకృత్యానికి పాల్పడ్డారు. సుమారు 500 మంది ప్రజలను దిగంబరులను గావించి తీవ్రాతితీవ్రంగా హింసించారు. దిగంబరులుగానే వారిని వీధులలో ఊరేగించారు.

ఏం తప్పు చేశారని ఆ గ్రామస్తులకీ శిక్ష!

భూమి కోసం... భుక్తి కోసం... బానిసత్వ విముక్తి కోసం... ఆంధ్ర మహసభ, కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ఆనాడు 'నైజాం సంస్థానం'లో తెలంగాణా రైతాంగ సాయుధ గెరిల్లా పోరాటం జరుగుతోంది.

నైజాం రజాకారు మూకలు, వారికి తోడుగా వచ్చిన ఇండియన్ యూనియన్ సైన్యాలు గ్రామాలపై బడి దొరికిన కమ్యూనిస్టులను దొరికినట్లు కాల్చి చంపుతున్నారు.

కమ్యూనిస్టు పార్టీ సాయుధ గెరిల్లా దళాలు అజ్ఞాతంలో ఉంటూ మెరుపు దాడులు చేస్తూ దొరలు, జాగీర్దార్లు, భూస్వాముల నుండి పేదలను విముక్తి చేస్తున్న రోజులవి. అదే కాలంలో ఇండియన్ యూనియన్‌లోని కోస్తా జిల్లాలు, ప్రధానంగా కృష్ణాజిల్లాలో కూడా కమ్యూనిస్టు పార్టీ ప్రభావం అధికంగా ఉండేది.

తెలంగాణా నుండి ఈ జిల్లాకు వచ్చి అజ్ఞాతవాసంలో ఉంటున్న కమ్యూనిస్టు నాయకులకు ఆశ్రయం ఇస్తున్నారన్న కారణంతోనూ... తెలంగాణా ఉద్యమ ప్రభావంతో ఈ జిల్లాలో అందరూ కమ్యూనిస్టులై పోతున్నారన్న భయంతోనూ... పోలీసులు కృష్ణాజిల్లాలో కూడా కమ్యూనిస్టు నాయకులుగా ఎదిగిన అనేకమందిని పొట్టనబెట్టుకున్నారు. మరెంతో మంది అజ్ఞాతంలో ఉండి పనిచేస్తున్నారు.

ఆ విధంగా అజ్ఞాతవాసంలో వున్న కమ్యూనిస్టు పార్టీ నేతలకు ఆశ్రయమిచ్చి, ఆదరిస్తున్నారన్న కోపంతోనే యలమర్రు, కాటూరు గ్రామాలపై జరిపిన పైన తెలిపిన ఘోర అకృత్యాలు. పోలీసులు ఎన్ని కిరాతకాలకు పాల్పడినా ఆ గ్రామస్తులను ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నుండి వేర్లు చేయలేకపోయారు.

సిగ్గుమాలిన పోలీసు దురంతాలపై ప్రముఖుల ప్రకటనలు

యలమర్రు, కాటూరు గ్రామాలలో జరిపిన పోలీసుల దురంతాలపై 1949 జులై 23వ తేదీనాటి 'ఆంధ్ర ప్రభ'లో ఆనాటి హరిజనాభివృద్ధి మాజీ మంత్రి, మద్రాసు రాష్ట్ర శాసనసభ్యులు వేముల కూర్మయ్య చేసిన ప్రకటన ఇలావుంది.

"యలమర్రు గ్రామంలో సుమారు 400 మంది ప్రజలను దిగంబరులను గావించి గాంధీ మహత్ముని విగ్రహం ముందు సాష్టాంగపడవేశారు. మహిళల ముందే పురుషులను దిగంబరంగా ఊరేగించారు. కొందరు మహిళలను కూడా వివస్త్రలను చేయడానికి ప్రయత్నించారు. పురుషులతో పాటు మహిళలను కూడా చింతబరికెలతో పదేపదే కొట్టారు. 1919లో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పంజాబ్‌లో సాగించిన అత్యాచారాల కంటే ఇవి దారుణంగా ఉన్నాయని అంటున్నారు. పోలీసు దాడులకు గురిచేయబడిన యలమర్రు గ్రామంలో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, తెలుగు మంత్రులు పర్యటించి శాంతిని కాపాడతామని, ప్రజల రక్షణకు కృషి చేస్తామని వాగ్దానం చేయవలసిందిగా కోరుతున్నాను."

ఆంధ్ర సోషలిస్టు పార్టీ కార్యదర్శి ఎ. చక్రధర్ కూడా 1949 జులై 24వ తేదీన ఈ ఘోర కృత్యాన్ని గర్హిస్తూ 'ఆంధ్రప్రభ'లో ప్రకటన చేశారు. అనేకమంది శాసనసభ్యులతో సహా ఎంతోమంది కాంగ్రెస్ నాయకులు కూడా ఈ దురంతాన్ని పత్రికల ద్వారా ఖండించారు.

★ ★ ★

1949 జులై 26నాటి 'ఆంధ్రప్రభ' సంపాదకీయం

యలమర్రు, కాటూరు ఘోర దురంతాలపై ఆనాడు ఆంధ్రలో ప్రముఖ దినపత్రిక 'ఆంధ్రప్రభ' 1949 జులై 26వ తేదీ సంచికలో రాసిన సంపాదకీయం ఇలావుంది.

"అనాగరికమైనవి, దారుణమైనవి, నోటితో చెప్పడానికి వీలుకానివి. ఇవి చాలా ఘాటైన పదాలే కావచ్చు. కృష్ణాజిల్లాలో పోలీసుల పాశవిక దాడులను వర్ణించడానికి ఈ మాటలు సైతం చాలవు.

ప్రతి గ్రామం నుండి ఒకే విధమైన, విషాదకరమైన, హేయమైన ఉదంతమే. ప్రజలందరినీ ఒక చోటుకు పోగుచేయడం, వారిని విచక్షణారహితంగా కొట్టడం, వారిలో కొంతమందిని వివస్త్రలను చేయడం, దిగంబరంగానే ప్రజలను ఆ వీధులలో ఊరేగించడం.

ఇలాంటి పనులు కమ్యూనిస్టులను అణచివేయడానికి దోహదపడవు. బ్రిటిష్ రాజ్యమే మెరుగని ప్రజలనుకునేటట్లు చేస్తుంది.

కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టులను అణచడానికి తాము చేసే ప్రయత్నాలలో పౌరహక్కులను ఉల్లంఘించడమే కాదు, భారత ప్రజలుగా జన్మించినందుకు ప్రజలు సిగ్గుపడవలసిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఈ అత్యాచారాలను నిలుపుదల చేయడమే గాక అందుకు బాధ్యులైన అధికారులను శిక్షించాలి.

న్యాయశాఖమంత్రి మాధవ మీనన్ ఈ ఘటనలను కమ్యూనిస్టుల ప్రచారమని తోసిపుచ్చినట్లు మాకు తెలియవచ్చింది. అది సరికాదు. మా కార్యాలయానికి లేఖలు రాసిన వారంతా కాంగ్రెస్ వాదులే. ఆ గ్రామాలను స్వయంగా సందర్శించి, విచారించి వచ్చిన తరువాతనే వారు రాశారు.

★ ★ ★

"అదిగదిగో అటు చూడు - చెంచీత ॥నందానా॥
కాటూరు, యలమర్రు - చెంచీత ॥నందానా॥
ఎంత ఘోరమో చూడు - చెంచీత ॥నందానా॥
బట్టలిప్పినారు - చెంచీత ॥నందానా॥
గాంధిబొమ్మ చుట్టు - చెంచీత ॥నందానా॥
నగ్నంగా తిప్పారు - చెంచీత ॥నందానా॥
ఎంత ఘోరమో చూడు - చెంచీత ॥నందానా॥

అంటూ కాటూరు, యలమర్రు గ్రామాలలో జరిగిన అత్యంత హేయమైన అత్యాచారాల గురించి, ఈనాటికీ చెంచులు పాటలు పాడుతూ, యాచకవృత్తి చేస్తూ అప్పుడప్పుడు మనకు తారసపడుతుంటారు. ★

కొండబాబు

ఆడిటోరియం అంతా హడావిడిగా ఉంది. అక్కడ సాహిత్యసభ జరగబోతోంది. ఒక వర్ధమాన కవి రాసిన కవితా సంపుటి ఆవిష్కరణ కూడా ఆ రోజు జరగబోతోంది.

నిర్వాహకులు హడావిడిగా లోనికి, బయటకూ తిరుగుతున్నారు. అప్పటికే కూర్చున్న సభికులు ఏవేవో ముచ్చటించుకుంటున్నారు. సన్నని సంగీతం వినిపిస్తోంది హాలులో.

"ఆలస్యమేమిటండీ... సభ ప్రారంభానికి" అని రెండో వరుసలోని ఒక సభికుడు అసహనం వెలిబుచ్చాడు.

"ముఖ్య వక్తా, గౌరవ అతిథీ రావలసి ఉందండీ... వారి కోసమే చూస్తున్నాం".

"ఏవరేమిటి వారు"? అన్నాడు మరో వ్యక్తి.. ఇన్విటేషన్ చూడకపోవడం చేత.

"ఒకాయన జగన్నాథ శ్రీమన్నారాయణ, మరొకాయన కవిశ్రీ"

"ఓహో చాలా పెద్దవారే... కొమ్ములు తిరిగిన పండితుడు జగన్నాథ వారు" అన్నాడు పక్కనాయన.

"వస్తారంటారా?"

"ఈయనకూ కొమ్ములొచ్చాయి. ఇంత చిన్న సభకు వస్తారా? అనేదే నా డౌట్!" మరొకాయనన్నారు.

అనూహ్యంగా వారు వచ్చేశారు. సభ సక్సెసయింది. వాద ప్రతివాదాలతో సహా.

★★★

సాధారణంగా సాహితీ సభలలో జరిగే ఇలాంటి సంభాషణల్లో దొర్లే పదాలు ఆసక్తికరంగా ఉంటాయి. అలాగే ఈ సభలోనూ 'కొమ్ములు తిరిగిన', 'కొమ్ములు వచ్చాయి' అనే పదాలు దొర్లాయి.

ఏదైనా ఒక అంశంలో సాధికారత సాధించిన దానికి విశేషణంగానూ, గర్వం పెరగడంగానూ రెండు అర్థాలతో ఈ పదాలు వాడటం గమనించొచ్చు. మరికొన్ని అర్థాలతో కూడా ఈ పదాన్ని వాడతారు.

శిష్టవ్యవహారికులే కాదు... గ్రామీణులు, ఇతరులు కూడా 'కొమ్ములు తిరిగిన వాడు' అంటూ వాడటం వింటాం. ఈ పదం అసలు అర్థం నుంచి ఈ అర్థానికి ఎలా వచ్చిందో చూద్దాం.

"పరిసర ప్రాణులలో ఏర్పడిన శారీరక

పరిణామాన్ని బట్టి విచిత్రమయిన నానుడులు పుడతాయి. అలాంటిదే ఇది. మనకు వ్యవసాయం ప్రధానమయిన వృత్తి గనుక దానిని బట్టి ఏర్పడినవీ ఎన్నో! ఇలాటి నానుడులలో కొన్ని పశువుల కొమ్ములతో సంబంధం గలవి కూడ వున్నాయి కొమ్ములు చూపు, 'కొమ్ములు తిరుగు', 'కొమ్ములు మొలచు' , 'కొమ్ములు వచ్చు' మొదలయినవి,.

పశువుల వయో నిర్ణయానికి కొమ్ములలో మార్పు, పళ్ళు రావడం తోడ్పడతాయి. కొమ్ములు మొలవగానే దూడ పెద్దదవుతుంది. కొమ్ములు రావడం అన్నా ఇదే. పొట్టేలు పెద్దదై కొద్దీ దాని కొమ్ములు వంపులు తిరుగుతూపోతాయి, ఎవరో పట్టుకొని మెలి పెట్టినట్టు మరికొన్నిటి కొమ్ములు ముదురుతాయి. ఆవు, గేదె ఎన్ని ఈతలు ఈనిందో తెలుసుకొనడానికి కొమ్ముల కణుపులు పరిశీలిస్తారు.

ఈ కొమ్ములు తిరగడం, కొమ్ములు రావడం, కొమ్ములు మొలవడం ఇతరత్రా అభివృద్ధినీ, బలాన్ని, అతిశయాన్ని, గర్వాన్ని తెలుపడానికి ప్రయుక్తమవుతాయి. "ఆయనా, అమ్మో! కొమ్ములు తిరిగిన పండితుడండీ!" అంటారు గొప్ప విద్వాంసుణ్ణి చూసి. పండితునికి కొమ్ములు ఉంటాయా? ఉండవు అంటే ముదిరి తిరిగిన పొట్టేలు కొమ్ముల లాగా గంభీరమయిన, గట్టిదయిన పాండిత్యం కలవాడన్న మాట.

కొమ్ములు రావడంతో పశువులకు విశిష్టత, గొప్ప, ప్రయోజకత్వం ఏర్పడుతాయి. ఈ గుణాలన్నీ మానవుని పై ఆధ్యారోపించబడినప్పుడు ఈ నానుడి ఏర్పడింది. కొమ్ములు మొలుచు అనేది కూడా ఇలాటిదే.

కొమ్ములు చూపు అనేది మాత్రం భయం కలిగించేది. కొమ్ములు గల ఏ పశువయినా తన మీదికి వచ్చే ఇతర పశువులనో, మృగాలనో, మనుష్యులనో ఎదుర్కొనడానికో, తరిమివేయడానికో కొమ్ములు చూపుతుంది. అంటే బెదిరించడం అన్నమాట. కొమ్ములే గదా వాటికి పరమాయుధం!

ఈ కొమ్ములు చూపు క్రమంగా బెదరించు, భయపెట్టు అనే నానుడి అయింది. జక్కన విక్రమార్క చరిత్రలో దీనికి శ్లేషతో చక్కని ఉదాహరణ వుంది:

"కుంభోదకము బోసి యంభోజముఖి పెంప
చూతంబు కొమ్ములు సూప దొడగె" (విక్ర, 4.132)

పాపం! ఎంతో ప్రేమతో కడవలతో నీరుపోసి పెంచితే, మామిడిచెట్టు కొమ్ములు చూపిందట! (బెదిరించిందట). కొమ్ములు మొలిచాయని సామాన్యార్థం! ★

పాఠక స్పందన

నాయకుల ఐక్యతకు తోడ్పడే కథ

25-11-2001 ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన సాక్షి కథ బాగుంది. ఆర్టీసీ కార్మికుల చైతన్యం ప్రేరణగా రాసిన ఈ కథ రాష్ట్రంలోని మిగతా కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకుల ఐక్యత విషయంగా ఒక అవగాహన కల్పించడానికి తోడ్పడుతుంది. కచేరి వాస్తవాలను చర్చిస్తూనే కడుపుబ్బ నవ్వించింది. బాలల చిత్రోత్సవం, దోహా సదస్సుపై ఇచ్చిన కవరేజి బాగుంది.

కొమ్మారెడ్డి లలిత, పెదవడ్లపూడి, గుంటూరు జిల్లా

ప్రత్యేకంగా విశ్లేషణ లేదు

చిల్డ్రన్స్ ఫెస్టివల్ గురించి ఇచ్చిన వ్యాసంలో పత్రికల్లోని విషయాలే మళ్ళీ రాశారు. విశ్లేషణ ప్రత్యేకంగా లేదు. దోహా డ్రామా వాస్తవాలను ప్రతిబింబించింది. కవర్‌పేజీ బాగుంది కాని, వ్యాసానికి తగినట్లుగా లేదు. మేధావి, సాక్షి బాగున్నాయి. ఆయా శీర్షికల్లోని బొమ్మలు ఇంకా ఆకర్షణీయంగా వుంటే బాగుంటుందని నా అభిప్రాయం. డాక్టర్ సలహాల స్థాయిని పెంచండి.

- బండి కాశీల, ఉస్మానియా క్యాంపస్, హైదరాబాద్

చిత్రకారుడి వ్యాసం బాగుంది

25వ తేదీ అనుబంధంలో కళాసాహితి పేజీలో ప్రచురించిన 'పల్లెజీవితాలను ఆవిష్కరించిన రాజయ్య కుంచె' వ్యాసం చాలా బాగుంది. ఇటువంటి కళాకారులను గురించి తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

ఉపయోగకరమైన శీర్షిక

నవంబర్ 25 ఆదివారం ప్రజాశక్తిలో ఆరోగ్యం శీర్షికన 'చెవి వ్యాధుల నివారణ' గురించి డా॥ వందన గారు చాలా బాగా తెలియజేశారు.

- పుట్టా శ్రీనివాసరావు, లక్కవరపుకోట, విజయనగరం జిల్లా

బుర్రా వారి ఇంటర్వ్యూ బాగుంది

నవంబర్ 18వ తేదీ అనుబంధంలో ప్రచురించిన ప్రఖ్యాత నాట్య, నాటక కళాకారుడు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి గారితో పరిచయం నాటక కళాభిమానులకు ఆనందాన్ని కలిగించేదిగా వుంది. రియల్‌స్టోరీ 'ఆమె జీవితమే ఒక పోరాటం' ఆసక్తికరంగానూ, ఆలోచింపచేసేదిగానూ వుంది.

- అనంతగజపతిరావు, తెట్టంగి, శ్రీకాకుళం జిల్లా